
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 15 మే 2024





అర్ధరాత్రి వరకు.. పోలింగ్

- రిసెప్షన్ సెంటర్లకు చేరిన ఈవీఎంలు
- మంగళవారం మధ్యాహ్నంతో ప్రక్రియ ముగింపు
- స్ట్రాంగ్‌రూంల్లో నేతల భవిష్యత్‌కు కట్టుదిట్టమైన భద్రత
- గంటల తరబడి సాగిన ప్రక్రియ.. ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలకు సీళ్లు వేస్తున్న కలెక్టర్ శివ శంకర్, ఎన్నికల పరిశీలకులు

నరసరావుపేట, బాపట్ల మే 14 (ఆంధ్ర జ్యోతి): సోమవా రం పోలింగ్ సంద ర్భంగా సాయంత్రం 6 గం టలకు గడువు ముగిసే సమయానికి క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసే సౌలభ్యాన్ని ఈసీ కల్పించింది. దీంతో ఉమ్మడి గుం టూరు జిల్లా లోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు పోలిం గ్ జరిగింది. తేదీ మారితే సాంకేతి కంగా ఈవీఎంల విషయంలో కొన్ని మార్పులు చే యాల్సి ఉండేది. అయితే అర్ధరాత్రి 12 గంటల లోపలే పోలింగ్ ప్రక్రియను అధికారు లు ము గించారు. ఆ తర్వాత పోలీసు రక్షణలో ఆయా నియోజకవర్గాలకు సం బంధించి ఈవీఎంలను పోలీసు రక్షణ లో రిసెప్షన్ సెంటర్లకు తర లించారు. పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ ముగిసిన తర్వాత ఏజంట్ల సమక్షంలో సీల్ వేసిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించారు. దీంతో అర్ధరాత్రి తర్వాత పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలతో బస్సుల్లో బయలుదేరిన సిబ్బంది, మంగళవారం ఉదయం వరకు రిసెప్షన్ సెంటర్లకు వస్తూనే ఉన్నారు. దీంతో గుంటూరు లోక్‌సభ, అసెంబ్లీలకు సంబంధించి నాగార్జున యూనివర్సిటీ, బాపట్లకు సంబం ధించి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, పల్నాడు కు సంబంధించి నరసరావుపేట సమీపంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాలలను రిసెప్షన్ సెంటర్లు రాత్రంతా సందడిగా మారా యి. నియోజకవర్గాల వారీగా కేటాయించిన స్టాల్స్‌లో ఆర్వోల సమక్షంలో ప్రక్రియ పూర్తి చేశారు. కలెక్టర్, ఎస్పీ, సంబంధిత ఆర్వోల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలలో ఈవీఎంలను భద్రపరిచి సీల్ వేసే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. పోలింగ్ ప్రక్రియ ముగించి ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించడంతో విధుల్లో పాల్గొన్న యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ్ సింగ్, ఖాజన్‌సింగ్, ఎస్పీ వకుల్ జిందాల్‌ల ఆధ్వర్యంలో స్ట్రాంగ్‌రూమ్‌లలో యంత్రాలను భద్రపరిచి రూమ్‌లకు సీల్ వేశారు. నరసరావుపేటలో రిసెప్షన్ సెంటర్ లోని స్ట్రాంగ్ రూంలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్, ఎన్నికల పరిశీలకులు శ్రీబూరే సర్వేశ్వరనరేంద్ర, శ్రీహరిప్రతాప్ సింగ్‌షాహి, ఎస్పీ బిందుమాధవ్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తదితరుల సమక్షంలో సీలు వేశారు.

స్ట్రాంగ్‌రూముల్లో నేతల భవిష్యత్

లక్షలాదిమంది ప్రజలు వ్యయ ప్రయాసలు కోర్చి ఇచ్చిన తీర్పు స్ట్రాంగ్ రూములలో భద్రంగా ఉంది. గుంటూరు, నరసరావుపేట, బాపట్లలోని రిసెప్షన్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. చీమ చిటుక్కుమన్నా పసిగట్టేలా సీసీ కెమెరాలు అమర్చారు. 24 గంటల పాటు ప్రత్యేక నిఘా విభాగం సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తుంది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు స్ట్రాంగ్ రూమ్స్ వద్ద రెండంచల భద్రత ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అధికారులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో నాలుగు ప్లటూన్‌ల కేంద్ర సాయుధ బలగాలను నియమించారు. రెండో అంచెలో రాష్ట్రస్థాయి సాయుధ బలగాలు భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. మూడో అంచలో డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో సివిల్ పోలీసులు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తుంటారు. కౌంటింగ్‌కు 20 రోజుల గడువు ఉండడంతో స్ట్రాంగ్ రూమ్స్‌లో ఉన్న ఈవీఎంల భద్రతపై ఎన్నికల సంఘం అధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించారు. దీంతో స్ట్రాంగ్‌రూముల్లోని ఈవీఎంల భద్రతపై గుంటూరు ఎస్పీ తుషార్ డూడి, పల్నాడు ఎస్పీ బిందుమాధవ్, బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్ పర్యవేక్షిస్తున్నారు. అం తేగాక సీసీ కెమెరాల ద్వారా అక్కడ పరిస్థి తులను నిరంతరం గమనిస్తూ ఉన్నారు.

వెల్లివిరిసిన మహిళా చైతన్యం

నరసరావుపేట, మే 14: ఓటుకు ఓటర్లు పోటెత్తగా మహిళా చైతన్యం వెల్లివిరిసింది. పురుషుల కంటే మహిళాలే అధికంగా ఓటు హక్కును విని యోగించుకున్నట్లు పోలింగ్ లెక్కలు తెలియ జేస్తున్నాయి. పురుషుల కంటే 31,470 మహిళల ఓట్లు అధికంగా పోలయ్యాయి. జిల్లాలో పోలింగ్ 85.69 శాతం నమోదైంది. గత ఎన్ని కల్లో 86 శాతం ఓట్లు పోలు కాగా ఈ సారి 0.31 శాతం తగ్గింది. మొత్తం 17,34,858 ఓటర్లకు పురుషులు 7,27,518 మంది, మహిళలు 7,58,988 మంది, ఇతరులు 88 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తగలబెట్టండి.. చంపేయండి



- మన జోలికి రావాలంటే గుండెలదరాలి
- తెలంగాణ హల్దియా నుంచి వచ్చిన రౌడీలు
- 300 మందితో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హల్‌చల్
- కారంపూడిలో టీడీపీ కార్యాలయం ధ్వంసం.. కారు దహనం
- పల్నాడులో పోలింగ్ అనంతరమూ పెట్రేగిన వైసీపీ మూకలు
- కొత్త గణేశునిపాడులో కాసు, అనిల్‌కుమార్ హల్‌చల్
- సంతగుడిపాడు.. మాదలలో టీడీపీ వర్గీయులపై దాడులు
- పల్నాడులో భయం భయం.. భారీగా పోలీసుల మోహరింపు

మాచర్ల నియోజకవర్గంలో మనకు ఎదురుండకూడదు. ఎదిరించే వారిని అంతం చేద్దాం. పోలింగ్ రోజున మనపై ఎదురు తిరుగుతారా.. నా కొడుకులందరినీ చంపేద్దాం.. ఆస్తులు తగలబెడదాం.. మన పేరు చెప్తే నియోజకవర్గం మొత్తం హడలిపోవాలి.. పది కాలాలపాటు మన జోలికి రావాలంటే ప్రత్యర్థుల గుండెలు అదిరిపోవాలి. తన్నండి.. తరమండి.. తగలబెట్టండి.. ఎవర్నీ వదిలిపెట్టొద్దు.

- అంటూ ఎమ్మెల్యే పీఆర్కే సోదరుడు వెంకట్రామిరెడ్డి రౌడీ మూకలను రెచ్చగొట్టాడు.

కారంపూడి, మాచర్లటౌన్, మాచవరం, నరసరావుపేట, మే 14: పల్నాడులో పోలింగ్ అనంతరం నెలకొన్న పరిణామాలకు పిన్నెల్లి సోదరుడి వ్యాఖ్యలే నిదర్శనం. ఎన్నికలకు ముందు దాడులు, దౌర్జన్యాలతో భయాందోళనలు సృష్టించిన వైసీపీ మూకలు పోలింగ్ అనంతరం కూడా పెట్రేగిపోయారు. పోలింగ్ రోజైన సోమవారం మధ్యాహ్నం నుంచి పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లో టీడీపీ వర్గీయులే లక్ష్యంగా దాడులకు దిగారు. మంగళవారానికి ఈ దాడుల పరంపర పతాకస్థాయికి చేరింది. ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీస్ శాఖ విఫలమైంది. దీంతో వైసీపీ శ్రేణులకు అడ్డంకి లేకుండా పోయింది. వైసీపీ మూకలు దాడుల నేపథ్యంలో ఏ నిమిషంలో ఏమి జరుగుతుందోనని ప్రజలు భయంభయంగా గడపాల్సి వచ్చింది. కారంపూడిలో వైసీపీ రౌడీ మూకలు చెలరేగిపోయాయి. టీడీపీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌వలికి చెందిన కారును ఆపి అందులో ప్రయాణిస్తున్న ఇద్దర్ని కొట్టి కారును దహనం చేశారు. వెంకట్రామిరెడ్డితో మాచర్ల నుంచి వచ్చిన 300 మంది రౌడీమూకలు కారంపూడిలో చెలరేగిపోయాయి. గృహాలపై, షాపులపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. మహిళలు ఇళ్ల తలుపులు వేసుకుని బిక్కుబిక్కుమంటూ తలదాచుకున్నారు. బ్రహ్మారెడ్డి డౌన్ డౌన్.. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వీరంగం చేశారు. చివరకు పోలీసు బలగాలు రాకతో వైసీపీ మూకలు వెనుదిరిగాయి.



కారంపూడిలో ధ్వంసమైన టీడీపీ కార్యాలయం

సీఐ నారాయణస్వామికి గాయాలు

కారంపూడిలో వైసీపీ రౌడీమూకలను నివారించేందుకు వచ్చిన సీఐ నారాయణస్వామి రాళ్ల దాడిలో గాయపడ్డారు. ఎస్పీ బింధుమాదవ్ కారంపూడికి చేరుకున్నారు. సీఐ నారాయణస్వామిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పిన్నెల్లి సోదరుల హౌస్‌అరెస్టు

మాచర్ల నియోజకవర్గంలో పలుచోట్ల విధ్వంసాలకు పాల్పడిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా దుకాణాలు మూసి వేయించారు. బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే పీఆర్కే ఇంటి సమీపంలో బారీకేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు

పోలింగ్ రోజున.. పోలింగ్ పూర్తి అయ్యాక వైసీపీ మూకలు విధ్వంసం నేపథ్యంలో జిల్లా అంతటా 144 సెక్షన్ అమలుకు కలెక్టర్ శివశంకర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జరా చేశారు. దీంతో పోలీసు శాఖ సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసింది.

నివురు గప్పిన నిప్పులా నరసరావుపేట

నరసరావుపేటలో కూడా దాడులు జరుగుతాయన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

టీడీపీ శ్రేణులకు అండగా జిల్లాకు పార్టీ ప్రత్యేక కమిటీ

మాచర్లలో హింసాత్మక సంఘటనలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డీజీపీకి ఫిర్యాదు చేశారు. జిల్లాలో జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో కార్యకర్తలకు అండగా నిలబడేందుకు ఏడుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీలో సభ్యులుగా పార్టీ నేతలు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు, బొండా ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, లావు శ్రీకృష్ణదేవరాయులు, జంగా కృష్ణమూర్తి, జూలకంటి బ్రహ్మారెడ్డిలను నియమించారు.

నరసరావుపేటలో పరిస్థితి నివురుకప్పిన నిప్పులా ఉంది. పట్టణవాసులు ఎప్పుడు ఏం జరగుతుందోన్న భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి వైసీపీకి చెందిన యువకులు కర్రలతో ద్విచక్ర వాహనాలపై హల్‌చల్ చేశారు. రోడ్డుపై ఉన్న అమాయకులపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు గృహాలు, పార్టీ కార్యాల యాల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో మంగళవారం టీసీ వర్గీలపై వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. దాడిలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు గాయ పడ్డారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

భారీ హింసకు పన్నాగం?

- హౌస్ అరెస్టులో ఉన్నా ఫోన్‌లో పిన్నెల్లి ఆదేశాలు

హౌస్ అరెస్టులో ఉన్న ఎమ్మెల్యే పిన్నెల్లి బ్రదర్స్ ఫోన్ ద్వారా తన మూకకు ఆదేశాలు ఇస్తూ దాడులు చేసే పన్నాగానికి కుట్ర పన్నుతున్నట్లు టీడీపీ వర్గాలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వందల మంది ప్రైవేటు సైన్యాన్ని దింపిన పిన్నెల్లి ఈ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా నిలిచిన నాయకులను టార్గెట్ చేసుకుని దాడులకు పన్నాగం చేస్తున్నట్లు ఫిర్యాదు చేశాయి. టీడీపీకి మద్దతుగా నిలిచిన మైనారిటీలు ఉండే నాగిరెడ్డి బజారు, మాచర్ల పాతపట్టణం కన్యకాపరమేశ్వరి గుడి సమీపంలో వైసీపీ ప్రైవేటు సైన్యం మోహరించినట్లు టీడీపీ నేతలు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. పిన్నెల్లి సోదరుల ఇంటి మార్గంలో బారీకేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో రెండు ప్లాటూన్ల ఎస్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. గుంటూరు నుంచి మరో 100 మంది కేంద్ర బలగాలను మాచర్లకు రప్పించనున్నారు. బస్టాండ్ సెంటర్, రింగురోడ్డు, పార్కు సెంటర్ తదితర ప్రధాన రహదారుల్లో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో పోలీసు పికెటింగ్ నిర్వహిస్తున్నారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ బిందుమాధవ్ మాచర్లకు చేరుకున్నారు.

విందు ఇచ్చి.. విధ్వంసం

మాచర్ల నియోజకవర్గంలోని తన అనుయాయులను పిన్నెల్లి సోదరుడు నమ్మలేదు. దీంతో తెలంగాణలోని నల్గొండ జిల్లా హాలియా మండలం కంభాలపల్లి నుంచి 300 మంది రౌడీలను మాచర్లకి రప్పించారు. వీరందరికీ మాచర్ల-సాగర్ ప్రధాన రహదారిలోని ఆర్టీసీ గ్యారేజీ పక్కన ఉన్న వెంచర్‌లో మందు, విందు ఏర్పాటు చేశారు. వీరందరిని రెచ్చగొట్టి 30 కార్లలో పోగేసుకుని కారంపూడి చెక్‌పోస్టు సెంటర్‌కు చేరుకున్నారు. రాడ్లు, కర్రలు, మారణాయుధాలు చేతబూని 300 మంది రౌడీలు పట్టణంపై విరుచుకుపడ్డారు. టీడీపీ కార్యాలయం ధ్వంసం చేశారు. టీడీపీ నేత కారు దహనం చేశారు. అనంతరం చిరువ్యాపారుల దుకాణాలను ధ్వంసం చేస్తూ రాళ్లు రువ్వారు. సుమారు గంటసేపు టీడీపీ సానుభూతిపరులు ఇళ్లను, దుకాణాలను, వాహనాలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు కారంపూడికి చేరుకుని వెంకట్రామిరెడ్డిని, రౌడీమూకలను కారంపూడి నుంచి బయటకు వెళ్లగొట్టారు. కాగా వీరంతా మాచర్ల మండలం రాయవరం జంక్షన్‌కు చేరుకున్నారు. పోలింగ్ రోజున రెంటచింతల మండలం పాలువాయిగేటులో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తనయుడుపై జరిగిన దాడిని అవమానంగా బావించి ఆ గ్రామాన్ని ధ్వంసం చేయడానికి సిద్ధమయ్యారు. పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. అక్కడి నుంచి నేరుగా మాచర్ల పట్టణంలోకి తీసుకొచ్చారు. రౌడీ మూకలు పట్టణ శివారులోని కొత్తపల్లి, రాయవరం జంక్షన్ వంటి పలు నిర్మానుష్యప్రాంతాల్లో తిష్టవేశారు. ఏ క్షణానైనా నియోజకవర్గంలోని టీడీపీ సానుభూతిపరుల గ్రామాలపై పడి దాడి చేయాలని కాసుక్కూర్చున్నారు.

కొత్తగణేశునిపాడులో ఉద్రిక్తత

మాచవరం మండలం కొత్తగణేశునిపాడులో మంగళవారం మధ్యాహ్నం వైసీపీ నేతలు రెచ్చిపోయారు. వైసీపీ నేతల పరామర్శ పేరుతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన అనిల్‌కుమార్, కాసు మహేష్‌రెడ్డి నాలుగు వందల మంది అనుయాయులు కర్రలతో గ్రామంలో వీరంగం సృష్టించారు. టీడీపీ వర్గీయుల ఇళ్లపై రాళ్లతో దాడులకు దిగారు. చల్లగుండ్ల సాంబశివరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు గృహాలకు సంబంధించిన అద్దాలు ధ్వంసమయ్యాయి. అనంతరం వైసీపీ గూండా మూకలు కర్రలతో టీడీపీ వర్గీయుల ఇళ్లపై దాడులు చేసేందుకు ప్రయత్నించగా టీడీపీ వర్గీయులు కూడా దీనికి ప్రతిస్పందించడంతో వివాదం తీవ్రస్థాయికి చేరింది. మాచవరం, పిడుగురాళ్ల, పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపేందుకు సిద్ధమయ్యారు. అనంతరం అనిల్‌కుమార్, కాసు మహేష్‌రెడ్డిలను పోలీసులు మరో మార్గం నుంచి పిడుగురాళ్లకి తరలించారు. టీడీపీ వర్గీయులు ఏమి జరుగుతుందోనన్న ఆందోళనతో ఒకచోట గుమిగూడారు. ఆ తర్వాత వైసీపీ మూకలు వివిధ మార్గాల ద్వారా పిడుగురాళ్లకి చేరుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతుంది. పిడుగురాళ్లలో అనిల్‌కుమార్, కాసు విలేకర్లతో మాట్లాడుతూ ఈ రోజు 400 మందితో వచ్చాం.. ఈ సారి 4 వేల మందితో వస్తామని కొత్తగణేశునిపాడు వాసులను హెచ్చరించారు.



కొత్తగణేశునిపాడులో పార్టీ శ్రేణులతో కలిసి గుంపుగా వెళ్తున్న అనిల్‌కుమార్ యాదవ్, కాసు మహేష్‌రెడ్డి

పొన్నూరుకు.. విపత్తు

- ఫారాలు గల్లంతు.. తేలని పోలింగ్ శాతం
- ఎన్నికల ప్రక్రియలో ఆది నుంచీ గందరగోళమే
- జిల్లా అధికారులను చికాకు పెట్టిన ఎన్నికల యంత్రాంగం

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఎక్కడా తేడా జరగకుండా అప్రమత్తంగా చూడాలి. అయితే గుంటూరు లోక్‌సభ పరిధిలోని పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఎన్నికల సంఘానికి చికాకు తెప్పించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పొన్నూరు ఆర్‌వోగా విపత్తుల నిర్వహణ శాఖ డిప్యూటీ కలెక్టర్ అనంత లక్ష్మీకు మారిని నియమించారు. ఎన్నికల నిర్వహణలో అనుభవరాహిత్యం స్పష్టంగా కనిపించింది. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి కూడా ఇక్కడ పలు విషయాల్లో గందరగోళం నెలకొంది. పోస్టల్ బ్యాలెట్ సందర్భంగానే తీవ్ర గందరగోళం తలెత్తింది. ఆ సమయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆర్‌వో లేకపోవడంతో ఓ దశలో ఆమెపై చర్యలకు కూడా సిఫార్సు చేయాలని అధికారులు భావించారు. ఎన్ని కల ప్రక్రియకు సంబంధించి ప్రతీ విషయంలో పొన్నూరు వెనుకనే ఉండేది. కనీసం పోలింగ్ సందర్భంగానైనా అధికారుల తీరు మారుతుందని ఆశించారు. అయితే ఎలాంటి మార్పు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చిన పరిశీలకులు కూడా కొంతమేరకు అసంతృప్తికి గురైనట్లు తెలిసింది. పోలింగ్‌ని సకాలంలో పూర్తి చేయడంలో పొన్నూరు నియోజకవర్గంలోని అధికారులు విఫలమయ్యారు. ప్రిసై డింగ్ ఆఫీసర్ డెయిరీలు, పలు ఫారాలు గల్లంతు కావడంతో పోలింగ్ శాతాన్ని ఒక కొలిక్కి తీసుకురావడంలోనూ జాప్యం జరిగింది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఏకంగా చింతలపూడిలోని పోలింగ్ బూత్‌లోకి వెళ్లి తిష్ట వేసినా పట్టించుకోలేదు. వేజండ్లలో సోమవారం రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సెక్టార్ల వారీగా వాహనాలను వేగవంతంగా రిసెప్షన్ సెంటర్‌కు తరలించ డంలో వైఫల్యం చెందారు. అన్ని నియోజకవర్గాల ఈవీఎంలు రూట్ల వారీగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరుకోగా పొన్నూరు వాహనాలు మాత్రం ఆలస్యంగా బయలుదేరాయి. అవి రిసెప్షన్ సెంటర్‌కు చేరుకునేసరికే మంగళవారం వేకువజామైంది. ఇక వాటిని స్ట్రాంగ్‌రూంకు చేర్చి సీలు వేసే సరికి మధ్యాహ్నం దాటింది.

సైన్స్ విద్యార్థుల కోసం

అన్ని బోర్డులకు సంబంధించిన టెన్త్, ఇంటర్ ఫలితాలు వెలువడ్డాయి. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా కెరీర్‌ను తీర్చిదిద్దుకునేందుకు సమయం ఇదే. నిజానికి ఇప్పుడు ఎన్నో కెరీర్లు ఉన్నాయి. సైన్స్, కామర్స్, ఆర్ట్స్ అలాగే మెడిసిన్, ఇంజనీరింగ్.... ఇలా ఎటువైపు మొగ్గుచూపినా అందమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. ఉదాహరణకు ఇంగ్లీష్ చదివితే ఏమి వస్తుందన్న ప్రశ్నకు లెక్చరర్, ట్రాన్స్‌లేటర్ కావచ్చన్నది ఒకప్పటి సమాధానం. కార్పొరేట్ ట్రైనర్ మొదలుకుని కంటెంట్ రైటింగ్ ఉనికిలోకి వచ్చిన తరవాత ఇంగ్లీష్ స్వరూప స్వభావమే మారింది. చివరాఖరుకు సినిమాలకు అడుగున ఆంగ్లంలోకి డైలాగ్స్‌ను అనువదించడం కూడా ఒక వృత్తిగా నేడు మారింది. ఏ సబ్జెక్టు తీసుకున్నా వృత్తిలో ఇమిడిపోగలిగే, నిలదొక్కుకోగలిగే విధమైన కెరీర్లు కుప్పలు తెప్పలుగా నేడు ఉన్నాయి. అలాగే కొన్ని వృత్తుల్లో చేరిన మొదటి నెలలోనే అధిక ఆదాయం ఉండదు. ఉదాహరణకు డాక్టర్ కాగానే, లాయర్ అవ్వగానే లక్షలు రావు. అనుభవం మాత్రమే అధిక ఆర్జనకు, ఆ వృత్తిలో నిలదొక్కుకునేందుకు వీలు కల్పిస్తాయి. ఏయే విభాగాల వారికి ఎలాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయో అవగాహన ఏర్పడితే చాలు. ఈ రోజుల్లో వివరాలు తెలుసుకోవడం సులువు. అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్‌లో వెతుక్కోవచ్చు. కోర్సుల ఎంపిక అనేది మున్ముందు జీవితాన్ని నిర్ణయించేది. అందుకే ఆచి తూచి అడుగు వేయాలి. ఎంపిక చేసిన కొన్ని కాలేజీలను మాత్రమే ఇక్కడ ప్రస్తావించాం.

టెన్త్, ఇంటర్ తరవాత

What Next



సైన్స్ గ్రూపులు

మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, స్టాటిస్టిక్స్ మొదలైన సబ్జెక్టులతో అవకాశాలు

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జనరల్)
- మర్చంట్ నేవీ (సైన్స్ వారికి మాత్రమే)
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- ఫ్యాషన్ డిజైన్
- బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ స్టడీస్
- లా (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫారిన్ లాంగ్వేజెస్ (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫిల్మ్, ఇంటీరియర్ డిజైనింగ్

బైపీసీ
- అగ్రికల్చర్ సైన్సెస్ (వెటర్నరీ/డైరీ సైన్స్/ హ్యూమన్ బయాలజీ
- ఉపాధినిచ్చే కోర్సులు
- పోస్ట్‌గ్రాడ్యుయేషన్
- బయోటెక్, జెనెటిక్స్
- రీసెర్చ్/టీచింగ్

బైపీసీ

ఎంపీసీ
- ఇంజనీరింగ్: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్, కంప్యూటర్, మెటలర్జీ, ప్రొడక్షన్, మెరైన్, లెదర్, సిరామిక్, ప్లాస్టిక్, ప్యాకేజింగ్ టెక్నాలజీ
- టెక్నికల్ డిప్లొమాలు
- ఆర్కిటెక్చర్
- బీఫార్మసీ

మెడిసిన్
- బీడీఎస్, ఆయుర్వేద, ఎండీఎస్
- ఎంబీబీఎస్ (పోస్ట్ గ్రాడ్యుయేట్ స్పెషలైజేషన్) భారతదేశంలో 2, 3 సంవత్సరాలు, విదేశాల్లో అయితే 5 సంవత్సరాలు
- హోమియోపతి
- పారా మెడికల్: ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, ల్యాబ్ టెక్నాలజీ, నర్సింగ్
- బీఎస్సీ: హోమ్ సైన్స్, హోమ్ ఎకనామిక్స్, హ్యూమన్ బయాలజీ, ఎన్విరాన్‌మెంట్
- ఎమ్మెస్సీ: చైల్డ్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్

దిక్సూచి DIKSUCHI

ఏవియేషన్ ఇండస్ట్రీ

మేథమెటిక్స్, ఫిజిక్స్‌తో ఇంటర్ పూర్తి చేసినవారు ఏరోనాటికల్ ఇంజనీరింగ్, సంబంధిత ఉద్యోగాలు చేయవచ్చు. సైన్సేతర రంగాలకు చెందిన విద్యార్థులు కమర్షియల్ ఏవియేషన్‌లోని క్యాబిన్ క్రూ, గ్రౌండ్ డ్యూటీ ఉద్యోగాలు ఎంచుకోవచ్చు. క్యాబిన్ క్రూ విషయంలో కొంత ఎగ్జయిట్‌మెంట్ ఉంటుంది. వివిధ దేశాలు తిరగడం, భిన్నమైన వ్యక్తులను కలుసుకోవడం వీరి ఉద్యోగంలో భాగం.

ఏవియేషన్ కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

- Central training establishment, Hyderabad.
- Global institute, B-1/637, 1st Flr, Janakpuri, Delhi - 110058
- Indian aviation academy, Office 7& 8, Rushabh Complex, Oshiwar Link Road, Andheri West, Mumbai - 400053.
- Aptima air hostess academy, Block-J, Rajouri garden, New Delhi-110027

సివిల్ ఏవియేషన్

భారతదేశంలో పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్స్ అత్యున్నతమైన సంస్థ. ఇది దేశంలోని ఎయిర్‌పోర్టులకు సంబంధించిన చాలా వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేసినవారు కూడా ఈ రంగంలోకి వెళ్లవచ్చు. ఇందులో ప్రధానంగా టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, కమర్షియల్ డివిజన్ ఉంటాయి. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఫిట్టింగ్ మొదలు ఎగిరే ప్రక్రియ వరకు ఇంజనీరింగ్ విభాగం పనే. కమర్షియల్ విభాగంలో కార్గో, ప్యాసింజర్ విమానాల సేవలు ఉంటాయి. పైలెట్ ట్రెయినింగ్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. వీటికి ఫీజు లక్షల్లో ఉంటుంది. ఎంట్రెన్స్ టెస్ట్‌లు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. కంటిచూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి. కమర్షియల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్, టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, ఎయిర్ క్రాఫ్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, కమర్షియల్ ఆపరేషన్ డివిజన్‌లో ఉద్యోగాలు ఉంటాయి. హోదాను బట్టి వీటిల్లో వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు నెల వేతనాలు లభిస్తాయి.

Colleges, Institutions and Universities

Some of the institutes offering aviation courses are as follows.

- Indian Institute of Aeronautics, Delhi.
- Bharat institute of aeronautics, Patna.
- Institute of aeronautics & Engineering, Bhopal.
- Flytech Aviation, PlotNo:24, Arunodaya Building, Paigah Colony, S.P Road, Secunderabad, Hyderabad-500006, Telangana, INDIA. Tel: (91)-040-66200000
- Avalon aviation academy, aptech house, A/65, MIDC, Andheri (E), Mumbai- 400093.
- There are multiple Aviation centres in Mumbai itself.
- Bombay university or Mumbai university now offers a 3 year B.Sc course in aviation. The course is being conducted by the institute of aviation and aviation safety (IAAS), an educational wing of the Mumbai based federation of Indian pilots. This course also trains students to be pilots and thus also offers commercial pilot's licenses (CPL) if one wishes to become a pilot.

షిప్పింగ్ ఇండస్ట్రీ

కనీసం 60 శాతం మార్కులతో ఫిజిక్స్, మేథమెటిక్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు షిప్పింగ్, మర్చంట్ నేవీకి సంబంధించిన కోర్సుల్లో చేరవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్‌లు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. ఇందులో డిగ్రీ, డిప్లొమా కోర్సులు ఉంటాయి. కంటిచూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి. ప్రధానంగా రెండు రకాల కోర్సులు ఉంటాయి.

- షిప్పింగ్
- మర్చంట్ నేవీ

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/pZH3yY5లో చదవండి.

మెరైన్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో మెరైన్ ఇంజనీరింగ్ కూడా ప్రత్యేకమైనది. సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ రంగంలోకి వెళ్లడానికి అర్హులు. ఐఐటీల్లో సీటు రావాలంటే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు తెచ్చుకోవాల్సిందే. ప్రైవేటు రంగం విస్తృతం అవుతున్న ఈ రోజుల్లో దీనికి మంచి భవిష్యత్తు ఉంటుందనడంలో ఎలాంటి అనుమానం లేదు.

ఐఐటీలు కాకుండా మెరైన్ ఇంజనీరింగ్‌ను అందిస్తున్న కాలేజీలు

List of marine engineering colleges

- T.S. Chanakya, karaus, New Mumbai - 400 706
- Haldia Institute of Maritime Studies And Research ICARE Complex, Marine Campus, P.O. Hatiberia, Haldia Dist. Purba Medinipur, 721657, West Bengal. Phone Nos: 03224 267501 / 267502
- RL Institute of Nautical Science, T.V.R Nagar Aruppukottai Road Elliyerpatti, Madurai, Tamil Nadu 6250224. Phone: 0452 391 8614
- Marine Engineering Research Institute, P-19, Taratolla Rd, Kol kata - 700088, Ph:033 2401 4675.
- Marine Engineering & Research Institute, Hay Bunder Road, Mumbai - 400033
- Lal Bahadur Shastri College of Advanced Maritime Studies & Research, Hay Bunder Road, Mumbai, Maharashtra 400033. Ph: 022 2371 9931
- The Calcutta Technical School, 110 SN Banerjee Road, Kolkatta - 700013
- Andhra University College of Engi neer-ing- Visakhapatnam, Andhra pradesh
- White Shark Marine Institute-New Delhi, Delhi
- Gujarat Technological University- Ahmedabad, Gujarat
- Praveenya Institute Of Marine Engineering - Vizianagaram, Andhra pradesh

కంప్యూటర్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ


కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో చేరాలనుకుంటే డిగ్రీ స్థాయిలో బీసీఏ ఉండేది. అయితే ఇంజనీరింగ్, ఎంసీఏ కోర్సుల్లో సీట్లు పెరిగిన తరవాత బీసీఏకు తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ తగ్గింది. అలాగే ఇంటర్‌లో మేథ్స్ చదివి, డిగ్రీ పూర్తిచేసినవారు మాత్రం ఎంసీఏ కోర్సుల్లో చేరవచ్చు. ఏ సబ్జెక్టులతోనైనా డిగ్రీ అర్హతతో పెద్ద సంస్థల్లో కంప్యూటర్ లాంగ్వేజెస్ నేర్చుకుని సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా, హార్డ్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా స్థిరపడుతున్నారు. ఎంబీఏకు తోడు సాఫ్ట్‌వేర్‌పై మంచి అవగాహన ఉన్నవారు సాఫ్ట్‌వేర్ మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. మొత్తం ఇంజనీరింగ్ కోర్సులకున్న అవకాశాలతో సమానంగా ఐటీ ఉద్యోగాలు లభిస్తున్నాయి. బీఈ/బీటెక్‌లో మొదట సీఎస్ఈ మాత్రమే ఉండేది. కాలక్రమంలో పలు ఆప్షన్స్ అందులోనూ వచ్చాయి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, ఐఓటీ, క్లౌడ్, బ్లాక్‌చెయిన్.. ఇలా పలు విభాగాలు ఆవిర్భవించాయి. ఇవన్నీ కలిసి, వేర్వేరుగా ఒక కోర్సుగా రూపొందాయి.

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ

మేథ్స్‌తో ఇంటర్ తరవాత ఇంజనీరింగ్‌లో చేరవచ్చు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ సహా పలు ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తున్నాయి. అవి చేసి ఇంజనీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీర్, అగ్రికల్చరల్ ఇంజనీర్, మైనింగ్ అండ్ పెట్రోలియం ఇంజనీర్, ప్లాస్టిక్ అండ్ రబ్బర్ టెక్నాలజిస్ట్, సిరామిక్ టెక్నాలజిస్ట్, టెక్స్‌టైల్ టెక్నాలజిస్ట్, ప్యాకేజింగ్ టెక్నాలజిస్ట్, లెదర్ టెక్నాలజిస్ట్‌లు కావచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

వర్క్ పూర్తి చేసుకున్న తలైవా



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'వేట్టయాన్' చిత్రం షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ సినిమా తెలుగు టైటిల్ ఏమిటన్నది ఇంకా వెల్లడించలేదు. 'జై భీమ్' సినిమాకు దర్శకత్వం వహించిన టీజే జ్ఞానవేల్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ బేనరుపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా, మంజు వారియర్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తన పాత్రకు సంబంధించిన వర్క్‌ను రజనీకాంత్ పూర్తి చేసుకోవడంతో చిత్ర యూనిట్ ఆయనకు వీడ్కోలు పలికింది. భారీ స్థాయిలో అంచనాలు కలిగిన ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తుండగా, ఎస్.ఆర్.కతీర్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

భారీ సెట్‌లో నాని పోరాటాలు



ఇంతకుముందెన్నడూ పోషించని పవర్ ప్యాక్ట్ పాత్రలో నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో ఉన్న అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. హై బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న పతాక సన్నివేశాల కోసం ఓ భారీ సెట్ వేశారు. ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్ జె సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆగస్టు 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి చెప్పారు.

రూ.835 కోట్లతో రామాయణ



ప్రస్తుతం అందరి దృష్టి బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' మీదే ఉంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ సినిమాను రూపొందించడానికి దర్శకుడు నితీశ్ తివారి కృషి చేస్తున్నారు. రెండు భాగాలుగా తయారవుతున్న ఈ సినిమా బడ్జెట్ ఎంతో తెలుసా? రూ. 835 కోట్లు. అది కూడా కేవలం తొలి భాగం కోసమే. నిర్మాణపరంగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత నమిత్ మల్హోత్రా ఖర్చు పెడుతూ, భారతీయ భాషలన్నింటిలోకి సినిమాను విడుదల చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు. సినిమా షూటింగ్ ఒక ఎత్తు అయితే, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఎంతో కీలకం. అందుకే 600 రోజులు కేవలం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కోసం కేటాయించనున్నారు. విమర్శలకు ఎక్కడా తావు లేకుండా, భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా మరోసారి చాటే విధంగా 'రామాయణ' నిర్మాణం జరుగుతోంది. మరి ఈ సినిమా విడుదల ఎప్పుడు? ఆ విషయంలో కూడా క్లారిటీ ఇచ్చారు ట్రేడ్ ఎనలిస్ట్ సుమిత్ కదెల్. ' 2027 అక్టోబర్‌లో 'రామాయణ' చిత్రం తొలి భాగం విడుదలవుతుంది' అంటూ ఎక్స్ ఖాతా ద్వారా ఆయన వెల్లడించారు.

లవ్ బడ్డీ



'ఊర్వశివో రాక్షసివో' చిత్రం తర్వాత అల్లు శిరీష్ నటిస్తున్న చిత్రం 'బడ్డీ'. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని తొలి పాట 'ఆ పిల్ల కనులే..'ను బుధవారం విడుదల చేస్తున్నారు. హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాట ఇది. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

ఆ మాస్క్ కథ ఏమిటి?



'ప్రేమిస్తే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తమిళ నటుడు భరత్ నటించిన 'మిరల్' సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. వాణి భోజన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి ఎం.శక్తివేల్ దర్శకత్వం వహించారు. సీహెచ్ సతీశ్‌కుమార్ నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ అందరినీ భయపెట్టింది. తాజాగా రిలీజ్ డేట్ వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. ట్రైలర్‌లో ఓ వింత మాస్క్ హైలైట్ అయింది. పోస్టర్‌లోనూ ఆ మాస్క్ కనిపించింది. ఆ మాస్క్ కథ ఏమిటన్నది చిత్రం చూస్తే కానీ తెలియదని దర్శకుడు అంటున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎన్.ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సురేశ్ బాలా, సమర్పణ: జగన్మోహిని, ఢిల్లీ బాబు.

రియలిస్టిక్ ఎంటర్టైనర్



పాపులర్ కమెడియన్ గెటప్ శీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 17న 'రాజు యాదవ్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు కృష్ణమాచారి మాట్లాడుతూ.. "దాదాపు 90 శాతం మంది మనుషుల్లో ఏదో ఒక చిన్న లోపం ఉంటుంది. ఇండియన్ మాజీ క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీకి చిన్నప్పుడు ఏదో సర్జరీ జరిగింది. దాని కారణంగా ఆయన ఎప్పుడూ నవ్వుతున్నట్లే కనిపిస్తారు. ఈ స్ఫూర్తితో కథ రాసుకుంటే బాగుంటుంది అనిపించింది. నాకు సహజత్వం అంటే ఇష్టం. అందుకే ఈ సినిమాను ఓ రియలిస్టిక్ ఎంటర్టైనర్‌లా తెరకెక్కించాను. ఈ పాత్రకు జీవం పోసే నటుల కోసం వెతికే క్రమంలో గెటప్ శీను ఈ రోల్‌కు యాప్ట్ అనిపించింది" అని చెప్పారు.

ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో...



నిఖిల్ విజయేంద్రసింహా, తేజు అశ్విని జంటగా నటిస్తున్న చిత్రం 'సంగీత్'. సాద్ ఖాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ మనోహరన్, మాజ్ ఖాన్ నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. నిహారిక కొణిదెల చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించగా, శౌర్య కెమెరా స్విచ్చాన్ చేశారు. ముహూర్తపు షాట్‌కు ఎస్.ఎస్.కార్తికేయ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు సాద్ ఖాన్ మాట్లాడుతూ "ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో సాగే కథ ఇది. ఓ పెళ్లి వేడుకలో జరిగే సంఘటనలను వినోదభరితంగా తెరకెక్కిస్తున్నాము" అని అన్నారు. హీరో నిఖిల్ విజయేంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా కథ నా హృదయానికి దగ్గరగా ఉంది. ఇందులో కథానాయకుడు సమర్థ్ పాత్రలో నేను, స్వర పాత్రలో తేజు అశ్విని నటిస్తున్నారు" అని చెప్పారు.

విడిపోవడమే మా ఇద్దరికీ మంచిది

జీవీ ప్రకాశ్ కుమార్

తమిళ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాశ్ కుమార్, గాయని సైంధవి దంపతులు తమ వైవాహిక బంధానికి ముగింపు పలికారు. విడాకులు తీసుకొన్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిద్దరూ సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. 'మేమిద్దరం ఎంతో ఆలోచించిన మీదటనే విడిపోవాలనే నిర్ణయం



తీసుకున్నాం. ఇది మా ఇద్దరికీ మంచిదని నమ్ముతున్నాం. ఇకపై ప్రశాంతంగా జీవితాన్ని కొనసాగిస్తాం. మా కెరీర్‌లో మరింత రాణించేందుకు ఈ మార్పు దోహదం చేస్తుందనుకుంటున్నాం. మా నిర్ణయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం' అని జీవీ, సైంధవి ప్రకటనలో పేర్కొన్నారు. వారిద్దరూ 2013లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కూతురు అన్వీ ఉంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌కు జీవీ మేనల్లుడు అవుతాడు. 'అసురన్, సూరారైపొట్రు, రాజారాణి, ఒంగోలు గిత్త' తదితర చిత్రాలకు జీవీ సంగీతం అందించారు. హీరోగానూ పలు చిత్రాల్లో నటించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WTdsiVZ లో చదవండి.



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో నినాదాలు చేస్తున్న రైతులు మహిళలు

ఐదేళ్లుగా పట్టిన గ్రహణం త్వరలో తొలగిపోతుంది

● 1610వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మే 14: ఐదేళ్లుగా రాజధాని అమరావతి రైతులకు పట్టిన గ్రహణం వీడిపోబోతుందని 33వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1610వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. జూన్ 4న రాష్ట్రానికి పట్టిన మూడు ముక్కల దరిద్రం పోతుందన్నారు. విజనరి నాయకుడు రాబోతున్నారని స్పష్టం చేశారు. సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానుల వంచనకు ఐదేళ్లు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. సోమవారం జరిగిన ఓటింగ్‌తో భరోసా వచ్చిందన్నారు. నియంతపాలన పోయి ప్రజాస్వామ్య పాలన వస్తుందన్నారు. రాష్ట్ర సంపదైన అమరావతి అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

రాష్ట్ర వ్యాప్తంగా కనువిప్పు కలిగించిన సుధాకర్ స్పందన

● రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సుధాకర్‌ని పరామర్శిస్తున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఐతానగర్ ఓటరు సుధాకర్ పోలింగ్ సందర్భంగా వ్యవహరించిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా కనువిప్పు కలిగించిందని రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన రిటైర్డు అదనపు ఎస్పీ కాళహస్తి సత్యనారాయణతో కలిసి జీజీహెచ్‌కి వచ్చి బాధితుడు గొట్టిముక్కల సుధాకర్‌ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఆయన నిబద్ధత, వ్యవహరించిన తీరు చాలా ప్రశంసాయుతంగా ఉన్నది. ఒక వ్యక్తిని ఎవరైనా దుర్భాషలాడి చేయి చేసుకొన్నప్పుడు మౌనంగా ఉంటే అదే నిజమని నమ్ముతారు. ఆయన తిరిగి జవాబు చెప్పిన తీరు చాలా ప్రశంసాయుతంగా ఉన్నదని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధి అనే వాళ్లు స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరపాలి. అయితే ఎన్నికల వ్యవస్థ బాగా పని చేసింది. పోలీసులే ముందుగా స్పందించి చర్యలు తీసుకొని ఉంటే బావుండేది. చివరికి ఎన్నికల సంఘం ఎమ్మెల్యేని హౌస్ అరెస్టు చేయమని ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో చార్టెర్డ్ అకౌంటెంట్ పీవీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి



పిడుగు పడిన ప్రదేశంలో నిర్జీవంగా పడి ఉన్న వినయ్‌కుమార్ ఇన్‌సెట్లో ఫైల్‌ఫొటో

అమరావతి, మే 14: గేదెలను మేపేందుకు పోలం వెళ్లిన యువకుడు మంగళవారం మధ్యాహ్నం పిడుగు బారినపడి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని ధరణికోట గ్రామంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. గ్రామానికి చెందిన బలుసుపాటి పాండురంగారావు కుమారుడు వినయ్‌కుమార్(21) గేదెలను తొలుకుని పోలం వెళ్లాడు. మధ్యాహ్నం 3.30గంటల సమయంలో వర్షం పడటంతో సమీపంలోని చెట్టు వద్దకు వెళ్లాడు. ఇంతలో పిడుగు చెట్టుపై పడటంతో అక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న రైతులు గమనించి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

కాసుని నమ్ముకుని రాజకీయాలు చేయొద్దు

● దివ్యాంగులపై కూడా దాడులకు పాల్పడటం సిగ్గుచేటు
● విలేకర్లతో ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, మే 14: వైసీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డిని నమ్ముకొని దాడులకు పాల్పడుతున్నారు.. టీడీపీ కార్యకర్తల రక్తం కళ్లచూస్తున్నారు.. ఎట్టి పరిస్థితుల్లో కాసును నమ్ముకొని రాజకీయాలు చేయొద్దు... జూన్ 4వ తేదీన కాసు ఫోన్ స్విచ్ ఆఫ్ అవుతుంది.. వైసీపీ నేతలు పోలింగ్ సరళిని చూసి భయపడి టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడి తమ రాక్షసత్వాన్ని బయటపెట్టుకుంటున్నారు అని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలో బాధితులను పరామర్శించేందుకు యరపతినేని శ్రీనివాసరావు వచ్చారు. దగ్ధమైన షాపులను, గాయపడిన వారిని సందర్శించి పరామర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ ప్రజలు అధికారం ఇచ్చింది ఒకరినొకరు చంపుకోవడానికి కాదు.. ఆ విషయం ఈ వైసీపీ కుక్కలు అర్థం చేసుకోవడం లేదు. పోలీసులను అడ్డం పెట్టుకొని బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలో 11మందిని హత్యచేశారు. అందులో తంగెడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వున్నారు. తంగెడ గ్రామం సమస్యాత్మక గ్రామమని పోలీసులకు ముందే చెప్పాం.. పోలీసు వ్యవస్థ వైఫల్యంతో తంగెడలో వైసీపీ దాడులకు పాల్పడింది. కాసు మహేష్‌రెడ్డి అహంకార ధోరణితోనే వైసీపీ కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారు. మరీ ముఖ్యంగా దివ్యాంగులు మెకానిక్ షెడ్డు పెట్టుకొని జీవనం సాగిస్తుంటే వారి షాపులపై కూడా పెట్రోలు బాంబులు వేసి షాపులను దగ్ధం చేస్తారా.. ఉద్యోగులు, ఎన్నికల సిబ్బందిని భయాందోళనకు గురిచేస్తారా... అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత నష్టపోయిన బాధితులందరికీ లక్షకు నాలుగు రూ.లక్షల చొప్పున ఎవరైతే దాడులకు పాల్పడ్డారో వారిచేతనే కట్టిస్తాను. దాడులకు పాల్పడిన ప్రతి వైసీపీ కార్యకర్త తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఎన్నాళ్లు మీ దౌర్జన్యాలు.. ఎన్నికల సరళి చూసిన తరువాత కూడా వైసీపీ నేతల్లో అహంకార ధోరణి తగ్గకపోవడం సరైంది కాదన్నారు. పద్ధతి మార్చుకోండి.. అంటూ యరపతినేని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓట్లు వేశామనే.. మాపై దాడులు చేశారయ్యా!

నాకు ఓటు వచ్చినప్పటి నుంచి ఈ రోజు వరకు కూడా జరిగిన ప్రతి ఎన్నికల్లో సైకిల్‌కే ఓటు వేశాను. అది మనసులో పెట్టుకొని వైసీపీ కార్యకర్తలు నాకు అన్నం పెడుతున్న నా మెకానిక్ షెడ్డుపై పెట్రోలు బాంబులు వేసి దగ్ధంచేశారు. నేను దివ్యాంగుడినైనా మెకానిక్ షెడ్డులో పనిచేసుకుంటూ నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నా కుటుంబానికి అండగా వున్న నా మెకానిక్ షెడ్డు దగ్ధమైంది. నేను ఎలా బతకాలి.. అంటూ దివ్యాంగుడు షేక్ నబీ సాహెబ్ బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు. మరో దివ్యాంగుడు షేక్ తండా జాన్‌పీరా కూడా మాట్లాడుతూ నేను టీడీపీ కార్యకర్తగా చురుగ్గా వున్నానని, మమ్మల్ని ఈ రకమైన కష్టాలకు గురిచేశారని తెలిపాడు. దివ్యాంగులు వందల మంది కార్యకర్తల మధ్య యరపతినేనితో జరిగిన నష్టాన్ని వివరిస్తూ కన్నీటి పర్యంతం కావడంతో వారి కుటుంబసభ్యులు బోరున విలపించారు. యరపతినేని తక్షణ సాయంగా షేక్ నబీసాహెబ్‌కు రూ.లక్ష, తండా జాన్‌పీరాకు రూ.50వేలు, షేక్ రంజాన్‌వలి అనే మరో మెకానిక్ షెడ్డు యువకుడికి రూ.50వేలు అందజేశారు. గ్రామంలో సోమవారం రాత్రి వైసీపీ బాంబు దాడులతో గాయపడిన వారిలో షేక్ చింతపల్లి లాల్‌జాన్‌బాష, తాటిమట్ల ప్రసాద్, చింతకింది జానీబాష, చింతపల్లి షేక్ హుస్సేన్, మాదినపాడు జాని, జంగమహేశ్వర ఖాశింసైదా, పీర్ అహ్మద్‌గారి హుస్సేన్, తుమ్మల నారాయణ, తోట వెంకట్రామయ్య, చింతపల్లి జాన్ అహ్మద్, బట్టువారిపల్లె నబీ రసూల్, బట్టువారిపల్లె ఖాశింసైదాలు వున్నారు. దగ్ధమైన షాపుల విలువ రూ.20లక్షలు వరకు వుండగా దగ్ధమైన 15 బైక్‌ల విలువ మరో రూ.30లక్షల వరకు వుంటుందని, రూ.50లక్షలకు పైగా ఆస్తి దగ్ధమైందని స్థానికులు యరపతినేనికి వివరించారు.

ప్రాణభయంతో కొట్టుమిట్టాడిన ఎన్నికల సిబ్బంది

సాయంత్రం 5.45 నిమిషాల వరకు ప్రశాంతంగా కొనసాగిన పోలింగ్ ఆ తరువాత బాంబులు, రాళ్లు, కర్రలతో వైసీపీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. తంగెడ గ్రామంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రానికి వెళ్లి గడ్డపలు గులతో మెయిన్‌గేటును పగులగొట్టే ప్రయత్నం చేశారు. ఇదే తరుణంలో పోలింగ్‌కేంద్రంపై పెట్రోలు బాంబులు కూడా పడ్డాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బంది ప్రాణభయంతో కొట్టుమిట్టాడారు.



వైసీపీ నేతల దాడుల్లో దగ్ధమైన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు తదితరులు



తంగెడలో వైసీపీ దాడులతో మెకానిక్ షెడ్డు కాలిపోయిన దివ్యాంగుడు షేక్ నబీ సాహెబ్ మోతాదుకు ఆర్థిక సాయం చేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు



తంగెడలో వైసీపీ నేతల దుశ్చర్యలను యరపతినేని శ్రీనివాసరావుకు వివరిస్తున్న ముస్లిం మహిళలు తదితరులు

దాడులు దుర్మార్గం

● క్యూలో ఉన్న ఓటర్లపై రాళ్ళు వేయడం దారుణం
● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మరెడ్డి, జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్ తదితరులు

నరసరావుపేట టౌన్, మే 14: జిల్లాలో దాదాపు అన్ని ని యోజకవర్గాలలో క్యూలో ఉన్న ఓటర్లపై రాళ్ళువేయడం దుర్మా ర్గమైన చర్యని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ ప ల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం కొమ్మాల పాటి మాట్లాడుతూ దాడులకు పాల్పడిన గూండాల మీద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. రిగ్గింగ్‌కు పాల్పడిన చోటు రీపోలింగ్ చేయాలని కోరారు. పల్నాడు జిల్లాలో అన్ని ని యోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

పోలీస్ సిబ్బందిని తక్కువ పెట్టారు..

పల్నాడులో సున్నితమై పోలింగ్ స్టేషన్లు అని చెప్పిన చోట పోలీస్ సిబ్బందిని తక్కువ పెట్టారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. దొండపాడులో రిగ్గింగ్ జరుతుంటే వెళ్ళితే కాన్వాయ్ మీద రాళ్ళదాడి చేశారని, పోలీస్ చేతిలో నుంచి లాఠీ తీసుకొని కారు పగలగొట్టాలని చూస్తుంటే కనీసం స్పందించలేదన్నారు. ఉన్నతాధికారులు ఎంత ప్రయత్నించినా కిందిస్థాయిలో ఎస్‌ఐలు, సీఐలు పూర్తిగా వదిలే యడం జరిగిందన్నారు. మరీ 11, 12గంటల నుంచి సీఐలు, ఎస్‌ఐలు, డీఎస్పీలు ఫోన్లు ఆన్సర్ చేయడం మానేశారన్నారు. టీడీపీ అనుకూ లం గా ఉన్నచోట ఎక్కువగా, వైసీపీకి అనుకులంగా ఉన్నచోట తక్కువ పోలీస్ ఫోర్స్ పెట్టారని ఆరోపించారు. మాచర్ల, నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబా బు వాహనాల మీద దాడి చేశారన్నారు. సబ్‌కలెక్టర్ ముందే ఎంపీ వాహనంపై దాడిచేయడం దురదృష్టకరం అన్నారు. దీనిని ఈసీకి ఫిర్యా దు చేస్తామని, అయినా పెద్దఎత్తున ప్రజలు అందరూ వచ్చి ఓటు వేశా రని, ఓటువేసిన ప్రతిఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు.

గూండాయిజాన్ని సహించేది లేదు..

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు సూచనల మీద ఎంత సమన్వయం పాటించినా అన్ని దాడులు టీడీపీ మీదే జరిగాయని, తామే నష్ట పోయామని మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కానీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. రాబోయేది తెలుగుదేశం పార్టీ, సంస్కరణలు తీసుకువస్తామని, ఇక్కడ ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం అన్నారు. రౌడీయిజం, గూండాయిజంను ఎట్టి పరిస్థితిలో సహించే ప్రసక్తేలేదని అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా రాష్ట్రంలో బతకాలని, బానిసత్వం నుంచి విముక్తి కలగాలని, అది చంద్రబాబునాయుడు అభిమతం అన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా కేసులు నమోదుచేసి దాడులకు పాల్పడిన వాళ్ళను శిక్షించాలన్నారు. నిన్నటి పోలింగ్ శాతమే టీడీపీ విజయానికి సంకేతమన్నారు.

ఓటమి భయంతో దాడులకు పాల్పడ్డారు

ఓటమి భయంతో వైసీపీ పథకం ప్రకారం ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు ఓటింగ్ శాతం తగ్గించాలని దాడులకు పాల్పడ్డారని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రూపెనగుంట్ల, దేచవరం, చీమలమర్రి, గుళ్లపల్లి, మాదల, దూళిపాళ, తొండేపి, చాగంటివారిపాలెం, లంకల కూరపాడు అనేక గ్రామాల్లో దాడుల చేశారన్నారు. ఓటింగ్ శాతం తగ్గించాలని వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా కార్యకర్తలు, ఓటర్లు అరాచకాలకు ఎదురు నిలబడి పోలింగ్ చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అరాచక ప్రభుత్వం ఇక పోయిందని, ఇక లేదని, జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్తాతాడా, జైలుకు వెళ్తాడా అనేది కాలమే నిర్ణయిస్తుందన్నారు.

ఓటింగ్ శాతం తగ్గించడానికి కుట్ర చేశారు

ఓటింగ్ శాతం తగ్గించడానికి, ఈవీఎం మిషన్లు నెమ్మదిగా నడిచేందుకు కుట్ర చేశారని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అనుమానం వ్యక్తం చేశారు. ఓటమి భయం లేకపోతే గ్రామాల్లో రాళ్ళ కుప్పలతో ఎందుకు ఉన్నారని ఆయన ప్రశ్నించారు. వైసీపీ క్యాడర్ చిలకలూరిపేట నియోజకవర్గం కావూరి దళిత కాలనీలో బూత్ వద్ద రాళ్ల, కర్రలు పెట్టుకొని దాడులు చేశారన్నారు. అదే విధంగా గురజవోలు, బుక్కాపురం, సాతులూరు తదితర గ్రామాల్లో దౌర్జన్యాలు చేయడానికి సిద్ధ పడ్డారన్నారు. ఏదేమైన కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పెదకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్, నరసరావుపేట టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

● తలను వేరుచేసిన దుండగులు
● పాత కక్షల నేపథ్యంలో ఘటన



యరగళ్ళ సుబ్బారావు (ఫైల్)

రేపల్లె, మే 14: రౌడీషీటర్ దారుణ హత్యకు గురైన ఘటన 18వ వార్డులో జగనన్న కాలనీ శివారు ప్రాంతంలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడ్డికాయ లంకకు చెందిన రౌడీషీటర్ యరగళ్ళ సుబ్బారావు(42) మట్టి తోలే పనులు చేస్తూ ఇసుకపల్లిలో సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్నాడు. భార్య శివపార్వతి వినుకొండలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుబ్బారావు గతంలో రెండు హత్యకేసుల్లో ముద్దాయిగా ఉన్నారు. ఒకటి గరువురోడ్డు సమీపంలో రౌడీషీటర్ రాయల శివ, రెండవది మాచర్లలో రౌడీషీటర్ ప్రేమ్‌కుమార్ హత్య కేసుల్లో ముద్దాయిగా ఉన్నారు. ప్రేమ్‌కుమార్ అనుచరుడైన డీజే ప్రకాష్, విశ్వనాథపల్లి ప్రసాద్ అనే ఇద్దరు హత్య చేశారని గుడ్డికాయలంకకు చెందిన ప్రత్యక్ష సాక్షి యరగళ్ళ గోపి తెలిపారు. సుబ్బారావు మిత్రులతో కలిసి మద్యం సేవిస్తుండగా హత్య జరిగింది. కత్తులతో విచక్షణారహితంగా నరికి తలను తీసుకుని వెళ్ళిపోయారని తెలిపారు. ఘటన స్థలానికి డీఎస్పీ మురళీకృష్ణ, పట్టణ సీఐ నజీర్‌బేగ్‌లు చేరుకుని సుబ్బారావు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న యరగళ్ళ గోపిని సంఘటన ఏవిధంగా జరిగింది అనే అంశంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పవర్.. పీక్

● అన్ని ఫీడర్లపై పెరుగుతున్న విద్యుత్ భారం
● ఈనెలలో రికార్డు స్థాయిలో 22.456 ఎంయూలకు చేరిన డిమాండ్
● రోజువారీ కోటాకు మించి వినియోగం
● లోడింగ్‌తో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు



ఎస్ఈ మురళీకృష్ణయాదవ్

గుంటూరు, మే14: వేసవిలో ఎండలు ఏవిధంగా మండుతున్నాయో... అదే స్థాయిలో విద్యుత్ డిమాండ్ అంతకంతకు పెరుగుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో విద్యుత్ వినియోగం భారీస్థాయిలో పెరగటం విద్యుత్ శాఖ వర్గాల్లోనూ టెన్షన్ పుట్టిస్తోంది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రెండు మిలియన్ యూనిట్లకు పైనే వినియోగం పెరిగినట్లు అధికారుల గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు సర్కిల్, సీఆర్‌డీయే సర్కిల్ పరిధిలోను గత ఏడాది విద్యుత్ వినియోగానికి పోల్చితే ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. మండుతున్న ఎండలతో పాటు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం కోసం ఎయిర్ కండీషనర్‌లు, ఎయిర్ కూలర్లతో పాటు కనీసం ఫ్యాన్ లేకుండా ఉండలేని పరిస్థితి నెలకొంది. ఉదయం పది గంటల నుంచే విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఈనెల 3వ తేదీన రికార్డు స్థాయిలో 22.456 మిలియన్ యూనిట్ల డిమాండ్‌కు చేరినట్లు అధికారులు తెలిపారు. కాగా రోజువారీ కోటా 18.26 మిలియన్ యూనిట్లు అది ఉండగా గణనీయంగా పెరుగుతోంది. గత నెలలో రోజువారీ కోటా 17.996 మిలియన్ యూనిట్లు ఉండగా 20.758 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగినట్లు రికార్డులు తెలియజేస్తున్నాయి. ఇదే గత ఏడాదిలో మే 18న 21.854 మిలియన్ యూనిట్లు రికార్డు స్థాయిలో నమోదైంది. రికార్డుస్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరగటంతో అన్ని ఫీడర్లపై భారం పడుతోంది.

డిమాండ్ పెరగడంతో సాంకేతిక అంతరాయాలు

లోడ్‌కు అదనంగా విద్యుత్ డిమాండ్ పెరగటంతో జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఇటీవల సాంకేతిక లోపాలతో అంతరాయాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా గృహ విద్యుత్ సరఫరాకు లోడ్‌కు అనుగుణంగా 100 కేవీ, 160 కేవీ, 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుంటారు. లోడ్ పెరగటంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజ్‌లు కాలిపోవటం, వైర్లు దగ్ధంకావటం వంటి ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. దాంతో అర్ధరాత్రులు, మధ్యాహ్నం అనే తేడా లేకుండా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అదే సమయంలో ఆపరేషన్ సిబ్బంది ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రణాళికాబద్ధంగా లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తే విద్యుత్ అంతరాయాలు నివారించవచ్చని సిబ్బందే చెబుతున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు పకడ్బందీ ఏర్పాట్లు

● గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్

గుంటూరు సర్కిల్ వ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇప్పటికే పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశాం. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో ఉంది. అడపాదడపా సాంకేతిక లోపాలతో అంతరాయాలే తప్ప విద్యుత్ కోతలనే ప్రశ్నే లేదు. అవసరమైన సామాగ్రిని కూడా అందుబాటులో ఉంచాం. అంతరాయాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

మాదల శకుంతల అంత్యక్రియలు పూర్తి



ప్రత్యేక వాహనంలో భౌతికకాయం అంతిమయాత్ర, ఇన్‌సెట్లో శకుంతల (ఫైల్)

గుంటూరు, మే 14: జనచైతన్య గ్రూపు సంస్థల డైరక్టర్ మాదల శకుంతల అంత్యక్రియలు మంగళవారం గుంటూరు స్తంభాల గరువులోని మహా ప్రస్థానంలో పూర్తయ్యాయి. ఈ సందర్భంగా గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ ముస్తఫా, మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కంభంపాటి నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, పయినీర్ గ్రూపు సంస్థల ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, భారతీయ ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ ఆర్గనైజర్లు సీహెచ్ మస్తానయ్య, నూతలపాటి తిరుపతయ్య, దాసరి హనుమంతరావు, అనేకమంది ప్రముఖులు రాజేంద్రనగర్‌లోని స్వగృహంలో మాదల శకుంతల భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తనయుడు మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ తన తల్లి శకుంతల ఎంతో కష్టపడి పెద్దచేశారని, జన చైతన్య గ్రూపు సంస్థలను ఎంతగానో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. తనయుడు, జనచైతన్య గ్రూపు సంస్థల ఛైర్మన్ మాదల సుధాకర్‌బాబు మాట్లాడుతూ తమ తల్లి శకుంతల లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదని, ఆమె ఆదేశానుసారం అనేక సంస్థలకు, వ్యక్తులకు, దేవాలయాలకు, ధార్మిక సంస్థలకు ఆర్థిక సహకారాలు అందించామని తెలిపారు. భవిష్యత్తులో ఆమె ఆశయాలను, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళతామన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

కడదాకా మీకు తోడుగా ఉంటా..

● గాయపడిన పార్టీ శ్రేణులకు బ్రహ్మారెడ్డి భరోసా



గాయపడ్డ టీడీపీ నేతలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, మే 14: మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా.. కడదాకా మీతోనే ఉంటా.. ఎవరూ అధైర్యపడొద్దు అంటూ మాచర్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి హామీనిచ్చారు. ఎన్నికల సందర్భంగా గాయపడ్డ రెంటాల గ్రామ టీడీపీ నేతలైన గొంటు నాగమల్లేశ్వరరెడ్డితో పాటు ఇతరులను పిడుగురాళ్ల ఆస్పత్రిలో మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మెరుగైన వైద్యం అందించాల్సిందిగా డాక్టర్లను కోరారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, మాజీ డీసీ చైర్మన్ నల్లబిరుదు నరశింహారావు, బోడపాటి రామకృష్ణ, శౌరైడ్డి, రాయపరెడ్డి, గోగుల వెంకట్రామిరెడ్డి, ఆదూరి శివ తదితరులున్నారు.

అలాగే పోలింగ్‌లో వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడి నరసరావుపేటలో చికిత్స పొందుతున్న ఆదూరి అలైక్య, భవాని ప్రసాద్, మల్లెల గోపి, గుంటూరులో చికిత్స పొందుతున్న ఫిరోజ్, షాజన్, షేక్ నయానా, తురకా నాగార్జున రమావత్ ప్రవీణ్‌లను బ్రహ్మారెడ్డి పరామర్శించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటానని భరోసానిచ్చారు.

అల్లర్లకు నాంది.. మాచర్లలో మార్పునకు పునాది

● అధికార పక్షాన్ని వీడి ప్రతిపక్షంలో భారీగా చేరికలు
● సూపర్ సిక్స్ మేనిఫెస్టో.. ప్రజల్లోకి సక్సెస్
● మాచర్ల నియోజకవర్గంలో భారీగా పెరిగిన పోలింగ్ శాతం
● నైరాశ్యంలోకి వైసీపీ.. ఓటమి భయంతోనే దాడులు



ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

మాచర్లటౌన్, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అల్లర్లకు ప్రధాన కారణం మాచర్ల నియోజకవర్గ ఓటర్లలో మార్పు రావడమేనని పలువురు విశ్లేషకులు బావిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని రీతిలో ఓటింగ్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఒకవైపు దాడులు, అల్లర్లు, రక్తపాతం జరుగుతున్నా ఓటర్లు మాత్రం వెనకడుగు వేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార వైసీపీలో ఉన్న మెజార్టీ నాయకులు పార్టీని వీడి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో గ్రామాల్లో భారీస్థాయిలో వర్గపోరు ఏర్పడింది. ద్వితీయశ్రేణి నేతల మధ్య ఏర్పడిన ఈ వర్గపోరు ఎన్నికల నేపథ్యంలో మరింత పెచ్చరిల్లింది. దీంతో ఎన్నికల వేళ ఏ మండలంలో చూసుకున్న టీడీపీ, వైసీపీ మధ్య గొడవలే దర్శనమిచ్చాయి. దీనికి ప్రధాన కారణం కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి భారీ స్థాయిలో విజయం సాధించబోతున్నారని ప్రచారం రావడం కారణంగా బావిస్తున్నారు. నాలుగుసార్లు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అభివృద్ధి చేయడంలో విజయం సాధించలేదని ప్రజలు బాహాటంగా అంటున్నారు. ఇటువంటి తరుణంలో మాచర్ల ప్రజానీకం మార్పు కోరుకోవడంలో తప్పేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికార పక్షం కేవలం అధికారం నిలుపుకోవడం కోసం గ్రామాల్లో వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడ్డారని బాహాటంగా విమర్శలు వస్తున్నాయి. కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన జూలకంటి బ్రహ్మారెడ్డిపై కారం చల్లి దాడి చేశారంటే ఏ స్థాయిలో అధికార పక్షం దాడులు చేశాయి అనేది చెప్పకనే చెప్తున్నాయి. వైసీపీకి ప్రధాన అడ్డాగా ఉన్న గ్రామాల్లో కూడా టీడీపీ పసుపుజెండా ఎగరేస్తుందని పార్టీ శ్రేణులు చెప్పుకొస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి చేపట్టకపోవడం, తాగునీటి సమస్యను సైతం తీర్చకపోవడం ప్రధాన సమస్యగా చెప్పుకుంటున్నారు. ఎంత సేపటికి వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామని, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశామని చెబుతున్నారు తప్ప సామాన్య ప్రజల సమస్యలు తీర్చడంలో విఫలమైందని అధికార పక్షంపై విమర్శలు గుప్పిస్తున్నా రు. భారీగా పెరిగిన ధరలు, విద్యుత్ చార్జీలు, సామాన్య, మధ్య తరగతి ఓటర్లను కూటమి వైపు చూసేలా చేశారనడంలో సందేహం లేదు. కూటమి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ సక్సెస్‌ఫుల్‌గా ప్రజల్లోకి వెళ్లింది. ఇది మార్పునకు కారణం కావొచ్చని బావిస్తున్నారు. అన్ని మార్పుల నేపథ్యంలో మాచర్ల నియోజకవర్గం మారడంలో సందేహం లేదని పార్టీ శ్రేణులు పక్కాగా చెబుతున్నాయి.

కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలి

సత్తెనపల్లి, మే 14: మధ్యవర్తిత్వం వహించి కేసులు ఎక్కువగా పరిష్కారమయ్యే విధంగా న్యాయవాదులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి చల్లా నాగ వెంకట శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు కే అనీల్ అధ్యక్షతన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు మాట్లాడుతూ మధ్యవర్తిత్వ చట్టం గురించి, దానిలోని పరిష్కారమయ్యే వాటికి, కక్షిదారులకు వచ్చే ప్రయోజనాల గురించి తెలియజేశారు. ప్రజలకు ఈ సెంటర్ ప్రాముఖ్యత గురించి న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు. దీనిలో కేసు పరిష్కారం ఐతే కోర్టు ఫీజు వాపస్ ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తి కలిగిన న్యాయవాదులు మధ్యవర్తిత్వం సెంటర్ ద్వారా కేసుల్లో మధ్యవర్తిత్వం వహించేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు పీ హుస్సేన్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు నరసింహారావుకు నివాళి



ఆమంచి నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం, కార్మిక సంఘాలు

క్రోసూరు, మే 14: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, రైతు ఉద్యమ నాయకులు ఆమంచి నరసింహారావు 26వ వర్ధంతిని మంగళవారం క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ, కౌలు రైతు సంఘం నాయకులు ఆ మంచి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు మాట్లాడుతూ పుల్లరి ఉద్యమంలోను, తెలంగాణా సాయుధ పోరాటంలోను, స్వాతంత్ర్య సమరంలోను, రైతు ఉద్యమాల్లోను ఆమంచి నరసింహారావు నిర్వహించిన పాత్ర మరిచి పోలేనిదన్నారు. వేల్పూరు సర్పంచ్‌గా సత్తెనపల్లి పాత తాలూకాలో జాతీయ స్థాయిలో రైతు ఉద్యమాలను నడిపిన, రైతు సదస్సులను నిర్వహించిన యోధుడు అన్నారు. మండల కౌలు రైతు సంఘం అధ్యక్షులు తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం, పులిచింతల ప్రాజెక్టు నిర్మాణాలకు ఆరోజుల్లోనే ఉద్యమాలు నిర్వహించిన గొప్ప రైతు నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో రావెళ్ళ వెంకటేశ్వర్లు, చిలకా ఏసయ్య, గుంటల చిన్నప్ప, కత్తుల గోపిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు గెలుపుపై టీడీపీ ధీమా

బెల్లంకొండ, మే 14: నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయటం ఖాయమని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే వస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో మండల నాయకులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా బెల్లంకొండ మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఎక్కువగా పోలింగ్‌బూత్‌ల వద్దకు తీసుకెళ్లినందుకు ధన్యవాదాలు తెలిపారు పెదకూరపాడు నియోజకవర్గంలో భాష్యం ప్రవీణ్‌కు 10వేలు మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తంగెడలో రెచ్చిపోయిన వైసీపీ మూకలు

● పోలింగ్ కేంద్రంపైన పెట్రోలు బాంబులు
● మైనారిటీలే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు



వైసీపీ నేతలు విసిరిన పెట్రోలు బాంబులతో దగ్ధమైన సైకిల్ షాపును పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు తదితరులు



బోరున విలపిస్తున్న దివ్యాంగుడు షేక్ మోతాదుబుడే సాహెబ్

పిడుగురాళ్ల, మే 14: ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో వైసీపీ నేతలు రెచ్చిపోయారు. ఓ వైపు పోలింగ్ జరుగుతుండటం, తమకు అనుకూలంగా ఓటర్లు తీర్పు ఇవ్వడం లేద నే అక్కసుతో వైసీపీ మూకలు ఎక్కడికక్కడ దాడులకు తెగబడ్డారు. దాచేపల్లి మండలం తంగెడలో పోలింగ్ జరుగుతుండగానే వైసీపీ శ్రేణులు కొందరు పోలింగ్ కేంద్రంపైనే పెట్రోలు బాంబులు విసరడంతో అక్కడి సిబ్బంది తృటిలో తప్పించుకున్నారు. ప్రాథమిక పాఠశాల సమీపంలో ముస్లిం మైనారిటీలకు చెందిన పంక్చర్, మెకానిక్, సైకిల్ షాపులపై కూడా పెట్రోలు బాంబులు విసరడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలింగ్ సరళిని తెలుసుకున్న వైసీపీ నేతలు అక్కసుతో పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించాలనే ఉద్దేశంతో టీడీపీ శ్రేణులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. మైనారిటీ సామాజికవర్గాల నేతలే లక్ష్యంగా వైసీపీ నేతలు ముస్లింల ఇళ్లపై పెట్రోలు బాంబులు, రాళ్ల వర్షం కురిపించారు. 135, 136 పోలింగ్ కేంద్రాలపై పెట్రోలు బాంబులు విసిరారు. గంటపాటు తంగెడ నుంచి తెలంగాణకు వెళ్లే రహదారి అంతా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో భయాందోళనకు గురైన టీడీపీ శ్రేణులు కూడా తిరుగుబాటుకు సిద్ధపడ్డారు. వైసీపీ శ్రేణుల వద్ద పెట్రోలు బాంబులు ఉండటంతో టీడీపీ శ్రేణులు కొంత వెనక్కి తగ్గారు. సమాచారం అందుకున్న దాచేపల్లి ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తంగెడలో వైసీపీ శ్రేణులు దివ్యాంగులను కూడా వదలకుండా దాడులకు తెగబడ్డారు. దివ్యాంగులైన షేక్ మోతాదు బుడే సాహెబ్, తండా జాని, షేక్ రంజాన్‌వలికి చెందిన దుకాణాలు పూర్తిగా దగ్ధం కావడంతో పాటు సుమారు 10ద్విచక్ర వాహనాలు సైతం వైసీపీ నేతలు దగ్ధం చేశారు. సుమారు 8మందికి పైగా టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడటంతో చేతులు, కాళ్లు విరిగి చికిత్స పొందుతున్నారు.

బాధితులకు అండగా ఉంటా : యరపతినేని

మైనారిటీలు, టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతల నిజస్వరూపం ఏమిటో బట్టబయలైందని, ఇప్పటిదాకా అనుభవించిన అధికారం చేజారి పోతుందన్న అక్కసుతో దాడులకు తెగబడటంతో వైసీపీ నేతల నైజం అర్థమవుతుందన్నారు. వైసీపీ శ్రేణుల దాడుల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరిని తాను ఆదుకుంటానని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎవరైతే దాడులకు పాల్పడ్డారో వారితోనే బాధితులకు పరిహారం అందించే విధంగా చూస్తానన్నారు. ఈ ఐదేళ్లలో గ్రామంలో తాను ఫలానా అభివృద్ధి చేశానని కాసు మహేష్‌రెడ్డి ఓట్లు అడగాలే తప్ప దౌర్జన్యాలకు పాల్పడటం, గ్రామస్థులను భయాందోళనకు గురిచేయడం సరికాదన్నారు. ఎవరైనా అభివృద్ధి చేసి చూపించి ఓటు అడిగే సత్తా ఉండాలే కానీ భయపెట్టి ఓట్లు వేయించుకోవడం సరికాదన్నారు. వైసీపీ శ్రేణులు ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకొని అభివృద్ధికి సహకరిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని.. లేదు మాకంతా కక్ష సాధింపులే కావాలనుకుంటే ఇక మీ ఇష్టం.. అన్నారు. వైసీపీ నేతల పెట్రోలు బాంబులతో దివ్యాంగులైన ముగ్గురి దుకాణాలు పూర్తిగా దగ్ధం కావడంతో షేక్ మోతాదుబుడే సాహెబ్‌కు లక్ష రూపాయలు, రంజాన్‌వలికి రూ.50 వేలు, తండా జానికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని యరపతినేని శ్రీనివాసరావు అందించి ఇకపై కూడా ఏ అవసరం వచ్చినా నేనున్నాననే భరోసాను కల్పించారు. గ్రామంలో పర్యటించిన యరపతినేని వద్ద తమ గోడు వెల్లబుచ్చుకున్నారు.

వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వారికి కన్నా పరామర్శ



నరసరావుపేటలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తను పరామర్శించిన కన్నా లక్ష్మీనారాయణ, నాగోతు శౌరయ్య తదితరులు

సత్తెనపల్లి, మే 14 : ఎన్నికల సందర్భంగా సోమవారం నకరికల్లు మండలంలో వైసీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడి నరసరావుపేట ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను మంగళవారం కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర నాయకులు నాగోతు శౌరయ్యలు పరామర్శించారు. నకరికల్లు, ముప్పాళ్ళ మండలాల్లోని పలు గ్రామాల్లో జరిగిన దాడిలో గాయపడిన నాయకులు, కార్యకర్తలను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయన్నారు. అరాచకాలను నమ్ముకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఓడి పోతున్నామనే భయంతోనే ఈ దాడులకు పాల్పడ్డారన్నారు. వైఎస్ జగన్‌కు కూడా ఓటమి భయం వెంటాడుతుందన్నారు. తప్పుడు వార్తలతో వైఎస్ జగన్ శునకానందం పొందుతున్నారన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి లేకుండా ప్రణాళికాబద్ధంగా వైసీపీ తమ కుట్రలు అమలు చేసిందన్నారు. నియోజకవర్గంలో వైసీపీ చేసిన హింసను కట్టడి చేయటంలో స్థానిక పోలీసు అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కారకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు ధన్యవాదాలు : భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 14 : నియోజకవర్గం చైతన్యానికి మారు పేరు అని, మరోమారు నిరూపితమైందని నియోజకవర్గ కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు ఉదయం 6గంటలకే పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరి ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకోవడం శుభ పరిణామమని వివరించారు. నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్‌బూత్‌లలో రాత్రి 11 గంటల వరకు కూడా వేచి ఉండి ఓట్లు వేయటం, వెల్లివిరిసిన ప్రజా చైతన్యానికి ప్రతీక అని, పెద్దసంఖ్యలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ కుటుంబసభ్యులకు అహర్నిశలు కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రవీణ్ ధన్యవాదాలు తెలిపారు.

పెదకూరపాడులో కూటమిదే విజయం

సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కూటమి ఘన విజయం సాధించటం ఖాయమని బాష్యం ప్రవీణ్ తెలిపారు. నియోజవర్గంలో మార్పు రావాలని బహిరంగంగా ప్రజలు కూటమి మద్దతు తెలిపారని వివరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేశారన్నారని, గంటల తరబడి క్యూలో నిలబడి ఓటింగ్‌లో పాల్గొన్నారంటే ప్రజల తీర్పు ఏ విధంగా ఉండబోతుందో ఊహించవచ్చన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సంక్షేమం, అభివృద్ధి అందించటానికి రానున్న ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజల ఆశీస్సులతో కూటమి అధికారంలోకి రాబోతుందనేది ఈ ఎన్నికల్లో స్పష్టమైందన్నారు. నియోజకవర్గంలో 89.18 శాతం ఓట్లు నమోదయ్యాయని వివరించారు.

క్రోసూరు మండలంలో అత్యధిక పోలింగ్ శాతం 90.6

● దొడ్లేరులో ఓటరు చైతన్యం



దొడ్లేరు హైస్కూల్లో బారులు తీరిన ఓటర్లు (ఫైల్ ఫొటో)

క్రోసూరు, మే 14 : నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో క్రోసూరు మండలంలో అత్యధిక పోలింగ్ శాతం 90.6గా నమోదైంది. మండలంలో 50,607 ఓట్లకు గాను 45,967 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం మొత్తం మీద 2,32,453 ఓట్లకు గాను 2,07,307 ఓట్లు పోలయ్యాయి. అమరావతి మండలంలో 59,104 ఓట్లకు గాను 51,812, బెల్లంకొండ మండలంలో 27,099 ఓట్లకు గాను 23,949, అచ్చంపేట మండలంలో 53,406 ఓట్లకు గాను 47,296, పెదకూరపాడు మండ లంలో 42,237 ఓట్లకు గాను 38,283 ఓట్లు పోలయ్యాయి.

పర్సన్‌టేజీల వారీగా బెల్లంకొండ మండలంలో 88.56 శాతం, అచ్చంపేట మండలంలో 88.26 శాతం, క్రోసూరు మండలంలో అత్యధికంగా 90.61 శాతం, పెదకూరపాడు మండలంలో 90.58 శాతం, అమరావతి మండలంలో 88.10శాతం ఓట్లు పోలయ్యాయి. క్రోసూరు మండలంలోని దొడ్లేరులో ఓటరు చైతన్యం వెల్లి విరిసింది. ఇక్కడ 87.12 శాతం ఓట్లు పోల య్యాయి. మండలంలోనే పెద్ద గ్రామమైన ఇక్కడ 7,230 ఓట్లకు గాను 6,299 ఓట్లు పోలయ్యాయి. దొడ్లేరులో పలు పర్యాయాలు కొట్లాటలు, ఘర్షణలు జరిగినప్పటికీ అత్యధిక శాతం పోలింగ్ నమోదు కావటం ఓటరు చైతన్యానికి నిదర్శనంగా భావిస్తున్నారు.

అమరావతి, మే 14: మండలపరిధిలో సోమవారం జరిగిన పోలింగ్ 88శాతం నమోదైంది. గ్రామాల వారీగా అమరావతి 78, అత్తలూరు 90, ధరణికోట 84, చావపాడు 94, దిడుగు 90, ఎండ్రాయి 91, ఎనికపాడు 95, జూపూడి 88, కర్లపూడి 90, లేమల్లె 89, లింగాపురం 93, మల్లాది 95, మునగోడు 92, టీపీ పాలెం 78, నరుకుళ్లపాడు 90, నెమలికల్లు 91, మండెపూడి 93, పెదమద్దూరు 90, పొందుగల 98, ఉంగుటూరు 89, వైకుంఠపురం 91శాతం నమోదైంది. 59,197 ఓటర్లకు గాను 52,070 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రెంటచింతల మండలంలో 81.04 శాతం

రెంటచింతల, మే 14: మండలంలోని 11 గ్రామాల్లోని 50 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పోలింగ్‌శాతం 81.04. గ్రామాల వారీగా వివరాలిలా ఉన్నాయి. పాలువాయి మొత్తం ఓటర్ల సంఖ్య 3642, పోలైన ఓట్లు 3258,89 శాతం,గోలి 1405కు గాను 1291,92 శాతం, మిట్టగుడిపాడు 1569కు గాను 1451,92 శాతం, మల్లవరం 1668కు గాను 1600,94 శాతం, పశర్లపాడు 2484కు గాను 2230,90 శాతం,పాలువాయి గేట్ 1464కు గాను 1019, 69 శాతం,మంచికల్లు 3431కు గాను 2960,86 శాతం, రెంటాల 4060కు గాను 3333,82 శాతం, రెంటచింతల 12,996కు గాను 9411,72 శాతం, జెట్టిపాలెం 3302కు గాను 2652,83 శాతం, తుమ్మకోట 4592కు గాను 3699, 87 శాతం ఓట్లు పోలయ్యాయి.మండలవ్యాప్తంగా 81.04 శాతం మంది ఓటును వినియోగించుకున్నారు. ఓటును వినియోగించుకున్న వారి సంఖ్య 32,906 మంది ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 40,603. 2019 ఏప్రిల్ 11న నిర్వహించిన ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 79 శాతం ఓటింగ్ జరిగింది. ఇప్పుడు 2.04 ఓట్ల శాతం పెరిగింది.

దుర్గి మండలంలో 86.86 శాతం

దుర్గి, మే 14: దుర్గి మండలంలో మొత్తం ఓటర్లు 41,866. వీటిలో 36,366 ఓట్లు పోలయ్యాయి. మహిళలు 18,345 మంది, పురుషులు 18,020 మంది, ట్రాన్స్‌జెండ ర్లు ఒకరు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.86 శాతం పోలింగ్ నమోదైంది. మించాలపాడు గ్రామంలో 93.97 శాతం నమోదైంది.

కారంపూడి మండలంలో 80.58 శాతం

కారంపూడి, మే 14: కారంపూడి మండలంలో 80.58 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 46,858 మంది ఓటర్లు ఉండగా 37,762 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషుల	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
● పెదకూరపాడు	2,32,463	1,01,833	1,05,469	5	2,07,307	89.18
● చిలకలూరిపేట	2,26,646	93,150	1,00,472	32	1,93,654	85.14
● నరసరావుపేట	2,32,778	92,040	96,648	15	1,88,701	81.06
● సత్తెనపల్లి	2,42,047	1,03,116	1,07,381	3	2,10,500	86.97
● వినుకొండ	2,64,559	1,16,772	1,19,263	1	2,36,036	89.22
● గురజాల	2,73,971	1,12,704	1,18,219	22	2,30,945	84.30
● మాచర్ల	2,62,404	1,07,903	1,11,538	10	2,19,451	83.69
మొత్తం	17,34,858	7,27,518	7,58,988	88	14,86,594	85.69

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి, మే 14 : సత్తెనపల్లి పట్టణంలో 11కేవీ విద్యుత్‌లైన్‌లో చెట్ల తొలగింపు కారణంగా ఈనెల 15వ తేదీ బుధవారం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవికిరణ్ మంగళవారం తెలిపారు. మెయిన్ రోడ్డు, బస్టాండ్ ఏరియా, ఇండోర్ స్టేడియం, కెనరా బ్యాంక్, పార్కు ఏరియా, మార్కెట్ ఏరియా, క్లాక్ టవర్ ఏరియా, రామాలయం వీధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

గాయపడిన కార్యకర్తలకు భాష్యం ప్రవీణ్ పరామర్శ



గాయపడిన గోపీని పరామర్శిస్తున్న భాష్యం ప్రవీణ్

అమరావతి, మే 14: ఎన్నికల సందర్భంగా వైసీపీ గూండాల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను పెదకూరపాడు ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పరామర్శించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యండ్రాయి గ్రామానికి చెందిన కాకి గోపి, అమరావతికి చెందిన నర్సమ్మ, బాలరాజులతో పాటు ధరణికోటలో పిడుగుపాటుకు మృతి చెందిన బలుసుపాటి వినయ్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఉంగుటూరు గ్రామంలో సోమవారం రాత్రి గాయపడిన బాధితులను పరామర్శించారు. వైసీపీ గూండాలు గ్రామానికి చెందిన ఆర్యవైశ్యుల ఇళ్లపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేశారు. వారిని కూడా పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ గూండాలు దాడి చేశారని త్వరలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని దాడులు చేసిన వారిని న్యాయపరంగా శిక్షిస్తారని అన్నారు. ప్రవీణ్ వెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, మే 14 : సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందు తున్న పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలను మంగళవారం పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పరామర్శించారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్య పడవద్దన్నారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి కార్యకర్తలకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని సూచించారు.

వైసీపీ దాడుల్లో గాయ పడ్డ వ్యక్తికి ఆర్థిక సాయం

క్రోసూరు, మే 14 : ఎన్నికల పోలింగ్ సందర్భంగా జరిగిన గొడవల్లో వైసీపీ దాడికి గురైన క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కే రామ్‌కుమార్, టీడీపీ నాయకుడు కుంభా ఏడుకొండలను మంగళవారం పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ గాయపడిన వారిని ఫోన్ ద్వారా పరామర్శించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ నాయకులు మన్నెం శివయ్య, దుద్దుల యోహాన్, షేక్ హసన్ తదితరులు ఉన్నారు.

కన్నా కార్యాలయం వద్ద సందడి



కన్నా లక్ష్మీనారాయణను కలిసిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

సత్తెనపల్లి మే 14: సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయం వద్ద మంగళవారం సందడి నెలకొంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అదికసంఖ్యలో కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయానికి తరలి వచ్చి పోలింగ్ సరళిపై విశ్లేషణ చేశారు. గ్రామాల వారీగా, పట్టణంలో వార్డుల వారీగా నమోదైన ఓట్ల వివరాలు, టీడీపీకి ఎన్ని ఓట్లు వస్తాయి, ఇతర పార్టీలకు ఎన్ని ఓట్లు వస్తాయి. అని లెక్కలు వేసి మరీ కన్నాకు తెలిపారు. ఏ గ్రామంలో ఏ వార్డులో తెలుగుదేశంకు మెజారిటీ వస్తుందనే విషయాన్ని కూడా తెలిపారు. ఎన్డీఏ కూటమి విజయం ఖాయం అని కన్నా లక్ష్మీనారాయణకు బారీ మెజారిటీ వస్తుందని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు లెక్కలు చెప్పారు. నియోజకవర్గం నుంచి తరలివచ్చిన ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు అభిమానులతో కన్నా కార్యాలయం కోలాహలమైంది. మున్సిపల్ మాజీ చైర్మన్ యెలినేడి రామస్వామి, టీడీపీ నాయకులు చౌటా శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, నాదెళ్ళ సత్యనారాయణ ఇతర టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కన్నాను కలిశారు.

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుంది

సత్తెనపల్లి, మే 14: సత్తెనపల్లి నియోజకవర్గంలో తన విజయం ఖాయమనే ధీమాను కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటం నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటం ఖాయమన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో వైసీపీ ఓటమి భయంతో ఎన్నో అరాచకాలు చేసి గెలవాలని ప్రయత్నించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉదయం పోలింగ్ ప్రారంభమైన దగ్గర నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సైనికులుగా కష్టపడి పనిచేశారన్నారు. ఓటమి భయంతో వైసీపీ కార్యకర్తలు ప్రతి గ్రామంలో రాళ్లు పోగుచేశారన్నారు. ఎన్నికల్లో గెలవమని అర్థమయ్యి పోలింగ్ శాతం తగ్గించాలనే ఉద్దేశంతో అవకాశం ఉన్నచోట్ల రాళ్ల దాడులు చేసి రేచ్చిపోయారన్నారు. వైసీపీ అరాచకాలను అడ్డుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, అభిమానులకు అయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

నాగిరెడ్డిపాలెంలో ఇరువర్గాలు బాహాబాహీ

బెల్లంకొండ, మే 14 : మండలంలోని నాగిరెడ్డిపాలెంలో మంగళవారం సాయంత్రం రెండు వర్గాల వారు బాహాబాహీకి దిగారు. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మంగళవారం ఉదయం నుంచి మద్యం తాగి టీడీపీ నాయకులను పదజాలంతో దూషిస్తున్నారు. ఆ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బాహాబాహీకి దిగారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించి వేశారు. దూషించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసస్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రాగానే ఇరువర్గాల వారు వెళ్లి పోవటంతో ప్రశాంతత నెలకుంది. నాగిరెడ్డిపాలెంలో ఇద్దరు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అచ్చంపేట మండలంలో ఉద్రిక్తత

అచ్చంపేట, మే 14: అచ్చంపేటతో పాటు పలు గ్రామాల్లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. మంగళవారం కూడా అచ్చంపేట, కొత్తపల్లి, వేల్పూరు గ్రామాల్లో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ నేపథ్యంలో అచ్చంపేట సీఐ కాలేషావలి పోలీసు బృందాలతో వెళ్లి ఇరువర్గాలతో మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడకుండా ఉండాలన్నారు. పోలీసులు ఆయా గ్రామాల్లో పర్యటించారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి

నకరికల్లు, మే 14: అడ్డరోడ్డులో ఉన్న అభయాంజనేయ స్వామి తిరునాళ్లను మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామి వారిని దర్శించుకొని అభిషేకాధి పూజలు చేశారు. తమలపాకులతో అర్చనలు చేశారు. మహిళలు పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వేద పండితులతో విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త కాళంగి వెంకట నరసింహా రావు పర్యవేక్షించారు. వినుకొండ కొండమాచార్యులు, వినుకొండ జానకి రామాచార్యులు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



వైసీపీ దాడిలో గాయపడి వైద్యశాల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, మే 14: ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావులు ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో పలు గ్రామాల్లో అరాచక శక్తుల దాడుల్లో గాయపడి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులను పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లడుతూ పోలింగ్ సందర్భంగా పల్నాడు ప్రాంతంలో అధికార పక్షంచేసిన దాడుల వెనుకున్న వైసీపీ అరాచక శక్తులందరిని అరెస్టుచేసి జైలులో పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడులు, హత్యాయత్నాలు, హింసాత్మక ఘటనలపై ఇప్పటికే పోలీసులకు సమాచారం ఇచ్చామని ఏ ఒక్కరినీ ఉపేక్షించవద్దని విజ్ఞప్తి చేశారు. నూజండ్ల మండల కేంద్రంలో వైసీపీ నాయకులు జనసేన పార్టీకి చెందిన వారిపై దాడిచేసి గాయపరిచినవైనం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. అమాయకులపై దాడిచేయడం హేయమైన చర్య అని ఈ సందర్భంగా ఆయన ఖండించారు. అదేవిదంగా పాత చెరుకుంపాలెం, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన తెలుగుదేశం పార్టీ నాయకులపై దాడిచేయడంతో గాయలయ్యాయని, పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని దాడులను అదుపు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. నూజండ్ల జడ్పీటీసీ సుబ్బులు భర్త రామయ్యతోపాటు పలువురికి గాయాలవడంతో వారిని పరామర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని మరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం ముందుకు వచ్చి ఓట్లు వేశారన్నారు. పోలింగ్ ఓటింగ్‌శాతం పెరిగిందని ఇది పూర్తిగా ప్రజల విజయమని, ప్రజాస్వామ్య విజయంగా వారు అభివర్ణించారు. వినుకొండలో అయితే పూర్తిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడే దాడులను ప్రోత్సహించారని ధ్వజమెత్తారు. నూజండ్ల మండలం జడ్పీటీసీ రామయ్యపై హత్యయత్నం చేయగా తృటిలో తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నారని తెలిపారు. త్రిపురాపురం, జంగాపల్లి, కొత్తనాగిరెడ్డిపల్లె, ఉప్పలపాడు, కొచ్చర్ల, ఇలా ఎన్నోచోట్ల వైసీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో మరీ కిరాతంగా దాడులకు తెగబడ్డారని ఆక్షేపించారు. ఏజెంట్లుగా ఉన్న వారిని భయటకు లాగి దౌర్జన్యం చేయడమే కాక కత్తులతో నరకడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త నాగిరెడ్డిపల్లెలో ఏజెంట్‌ను, త్రిపురాపురం దళిత నాయకుడు శ్రీనివాస్‌ను అతి దారుణంగా కొట్టారన్నారు. తెలుగుదేశం పార్టీకి ఓటు వేయవద్దని, ఏజెంట్లుగా ఉండవద్దని వైసీపీ నాయకులు బెదిరించి ఇలా హింసకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుట్లపల్లి ఎస్సీ కాలనీలో వెంటపడి కొట్టారన్నారు. దళితుల మీద దుర్మార్గంగా దాడులు చేయడం దారుణంగా ఉందన్నారు. వైసీపీ నాయకులు ఇక రోజులు లెక్కబెట్టుకోవాల్సిందేనని హెచ్చరించారు. జూన్ 4న జగన్‌రెడ్డి ప్రభుత్వం పతనం కావడం కాబోతుందని, త్వరలో వీరందరి లెక్కలు సరిచేస్తామన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రావాలని ఎండలను సైతం లెక్కచేయకుండా వచ్చి ఓట్లు వేశారన్నారు. గ్రామాల్లో భయానికి వాతావరణం సృష్టించి ఓట్లు వేయించుకోవాలని బొల్లా బ్రహ్మనాయుడు ఇదంతా చేశారని మక్కెన మండిపడ్డారు. జంగాలపల్లెలో బొల్లానే స్వయంగా బూత్‌లోకి వెళ్ళి పోలీస్, పోలింగ్ అధికారులను దూషించి ఈవీఎంలను కూడా బయటకు వేశారన్నారు. ఓడిపోతున్నామనే భయంతో ఓటింగ్ సరళి అర్థమై ఉద్రిక్తతలు రెచ్చగొట్టి పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి గెలవాలని ప్రయత్నాలుచేశారని దుయ్యబట్టారు. ప్రజలు వాటన్నిటిని గమనించి మంచి తీర్పు ఇవ్వబోతున్నారని స్పష్టం చేశారు. త్వరలోనే వీటన్నింటికి తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. జీవీ అంజ నేయులుతోపాటు ఎంపీ కృష్ణదేవరాయలు మంచి మెజార్టీతో గెలవబోతున్నారని స్పష్టం చేశారు.

'అల్లర్లను అరికట్టడంలో పోలీసులు విఫలం'

వినుకొండ టౌన్ మే 14: ఎన్నికల అనంతరం నూజండ్ల మండల కేంద్రంలో వైసీపీ నాయకులు జనసేన, టీడీపీ నాయకులపై చేసిన దాడిని ఎంపీ అభ్యర్థి కృష్ణదేవరాయులు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మాచర్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మరెడ్డి, మక్కెన మల్లికార్జునరావులు మంగళవారం తీవ్రంగా ఖండించారు. వైసీపీ అల్లరి మూకల దాడిలో గాయపడి వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ నూజెండ్లలో దాడులు, గుట్లపల్లి, చెరుకుంపాలెంలో దళితులపై దాడులు, మాచర్లలో హింసాత్మక సంఘటనలు చూస్తే హృదయవిదారకంగా ఉందని, కారంపూడిలో సీఐతోపాటు, ప్రజలపై యథేచ్చగా దాడులు చేశారన్నారు. ఈ రాక్షసపాలనపోవాలనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఓటు వేశారని, పల్నాడు ప్రాంతంలో కూడా అదే జరిగిందని ఎన్డీఏ ప్రభుత్వం రాబోతుందని, పోలింగ్ రోజున 11 గంటల తర్వాత గొడవలు చేయాలని సీఎం జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకే ఎమ్మెల్యేలు వైసీపీ కార్యకర్తలను పురిగొలిపి గొడవలకు ఆజ్యంపోశారన్నారు. బ్రహ్మనాయుడు ఓడిపోతారనే భయంతో పోలింగ్‌శాతం తగ్గించేలా చేయాలని కార్యకర్తలతో మీటింగ్ పెట్టిన మాట వాస్తం కాదా అని అన్నారు. ఎస్సై లక్ష్మీనారాయణరెడ్డి తన్ను కోమని చెప్పి పక్కకు పోయారని, దీంతో ఇంతమందికి గాయాలయ్యాయంటే ఎస్ఐ బాధ్యతాయతంగా వ్యవహరించడమే కారణమని తెలిపారు. జూలకంటి బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలనుంచి దూరమైపోయారన్నారు. ప్రజలు ఎన్డీఏ కూటమికి అధికారాన్ని కట్టబోతున్నారన్నారు. దాడులను అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలమైయ్యారని చెప్పారు. పోలీస్ వ్యవస్థ స్వేచ్ఛగా పనిచేయనీయకపోతే పరిస్థితులు ఎలాఉంటాయో ఈరోజు మనం చూశామని లావు కృష్ణదేవరాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్వేచ్ఛగా పనిచేయాలన్నారు. బొల్లా అవినీతిని వెలికితీస్తానని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన నూజండ్ల మండలం జడ్పీటీసీ జెడ్డా రామయ్యను పరామర్శిస్తున్న జీవీ

ఓటమిని జీర్ణించుకోలేకనే: లావు శ్రీకృష్ణ దేవరాయలు

నరసరావుపేట రూరల్, మే 14: పల్నాడు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ జీర్ణించుకోలేక వైసీపీ రౌడీ మూకలు దాడులకు తెగబడ్డారని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఆరోపించారు. పల్నాడు జిల్లాలో పోలింగ్ సమయంలో వైసీపీ మూకలు దాడులకు పాల్పడి ఎలాగైనా రిగ్గింగ్ చేసేందుకు ప్రయత్నించారని ఆడ్డుకునేందుకు ప్రయత్నించిన టిడిపి నాయకులపై దాడులకు తెగబడ్డారన్నారు. జిల్లాలో వైసీపీ మూకల దాడులలో గాయపడి నరసరావుపేటలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తలను మంగళవారం టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు, మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మరెడ్డి పరామర్శించారు.

చిలకలూరిపేటలో 85.44 శాతం పోలింగ్

చిలకలూరిపేట, మే 14: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో 85.44 శాతం పోలింగ్ నమోదయింది. నియోజకవర్గంలో మొత్తం 2,26,646మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,08,392మంది కాగా మహిళలు 1,18,205గా ఉన్నారు. ట్రాన్స్ జెండర్లు 49మంది ఉన్నారు. ఈ ఎన్నికలలో ఓటువేసిన వారిలో పురుషులు 93,150 మంది ఉండగా మహిళలు 1,00,472 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 32మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 1,93,654 మంది ఓటువేశారు. ఎన్నికలలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పురుషుల కంటే ఏడువేలమంది మహిళలు ఎక్కువగా ఓటువేసిన వారిలో ఉన్నారు. నియోజకవర్గంలో ఈసారి గతంలో ఎన్నడూ లేని రీతిలో అత్యంత ఎక్కువగా పోలింగ్ శాతం నమోదయింది. 2019 ఎన్నికలలో పోలింగ్ శాతం 83.9 గా ఉంది. 2019 ఎన్నికల కంటే ఈ ఎన్నికలలో 1.45 శాతం పోలింగ్ ఎక్కువగా నమోదయింది.

యడ్లపాడు మండలంలో 89 శాతం పోలింగ్

● గత ఎన్నికల కన్నా 2శాతం తగ్గుదల

యడ్లపాడు, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు పోటీపడ్డారు. మంలంలోని 18 గ్రామ పంచాయితీల పరిధిలో 44,381 మంది ఓటర్లు ఉండగా 39,807 (89శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు, వృద్ధులు, యువత ఉదయం 6గంటలకే పెద్ద సంఖ్యలో ఓటువేసేందుకు పోలింగ్ కేంద్రాలకు పెద్దఎత్తున తరలివచ్చారు. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించినప్పటికీ, మండుటెండను, ఉక్కపోతను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలైన్లలో వేచిఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. అధికారులు ఓటర్లకోసం మండలంలో 57 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా కొన్ని బూత్‌లలో ఈవీఎంలు గంటనుంచి గంటన్నర సేపు మొరాయించాయి. అయితే 6గంటలలలోపు క్యూలో నిలుచున్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసేందుకు అధికారుల అనుమతి ఇచ్చారు. దీనితో ఆయా పోలింగ్ కేంద్రాలలో పొద్దుపోయేంతవరకు పోలింగ్ కొనసాగింది. కొన్నిచోట్ల 9గంటల వరకు మహిళలు, యువకులు క్యూలైన్లలో వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో నియోజకవర్గంలో 91శాతం నమోదుకాగా ఈ ఎన్నికలలో 2 శాతం తక్కువగా 89శాతం నమోదయ్యింది. అయితే నియోజకవర్గ సగటు 85శాతంకన్నా మండల సగటు4శాతం అధికంగా నమోదు కావడం విశేషం.



వైసీపీ మూకల దాడిలో గాయ పడిన కార్యకర్తలను పరామర్శిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

పేరూరుపాడులో ఇరువర్గాల మధ్య ఘర్షణ



పేరూరుపాడులో వైసీపీ దాడుల్లో అద్దాలు పగిలిన కారు

బొల్లాపల్లి, మే 14: మండలంలోని పేరూరుపాడులో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఎస్ఐ చెన్నకేశవులు తెలిపిన వివరాల ప్రకారం పేరూరుపాడులో మధ్యాహ్న సమయంలో పోలింగ్ బూత్‌లో స్వల్ప వాదులాట ఇరుపార్టీల వ్యక్తుల మధ్య జరిగింది. ఈ నేపథ్యంలో రాత్రి టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపై ఒకరు స్వల్ప దాడులు పాల్పడ్డారు. ఈ దాడుల్లో టీడీపీకి చెందిన గరికపాటి నాగేశ్వరరావు, గరికపాటి బ్రహ్మం కార్ల అద్దాలు పగిలిపోయాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాల వారిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ దాడుల్లో అద్దాలు పగిలిన కార్లను, పరిసరాలను ఎస్ఐ చెన్నకేశవులు మంగళవారం గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు.

వైసీపీ నాయకుల దాడిపై ఫిర్యాదు

రొంపిచర్ల, మే 14: మండలంలోని రెడ్డిపాలెం 6వ నెంబరు పోలింగ్ కేంద్రంలో తనపై పలువురు వైసీపీ నాయకులు దాడిచేశారని జాతీయ జనసేన పార్టీ అసెంబ్లీ పార్లమెంట్ అభ్యర్థి గోదా రమేష్‌కుమార్ రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదుచేశారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద పలువురు వైసీపీ నాయకులు తనపై దాడి చేశారన్నారు. ఓటు వేయటానికి ఒకరి తరువాత ఒకరిని పంపమన్నందుకు తనపై దాడి చేశారని పీవోకు తెలియజేసినా ఆయన కూడా స్పందించలేదని పేర్కొన్నారు. తనపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు.

పోలింగ్ ముగిసినా ఆగని స్వల్ప వివాదాలు

శావల్యాపురం, మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత కూడా కొన్ని గ్రామాల్లో స్వల్ప వివాదాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. పోలింగ్ జరుగుతున్న సమయంలో కారుమంచి, గంటుపాలెం, పిచికలపాలెం, శానంపూడి, ఇర్లపాడు, గంటవారిపాలెం, వేల్పూరు గ్రామాల్లోని పోలింగ్ బూతుల్లో స్వల్ప వివాదాలు జరిగాయి. కొన్ని గ్రామాల్లో వివాదాలు వెంటనే సద్దుమణిగినా శానంపూడి, గంటవారిపాలెం, వేల్పూరు గ్రామాల్లో మాత్రం పోలింగ్ ముగిశాక కూడా వివాదాలు కొనసాగాయి. శానంపూడిలో పోలింగ్ ముగిశాక టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై మరొకరు రాళ్ళు రువ్వుకొన్నారు. గంటవారిపాలెంలో కూటమి అభ్యర్థులకు, కాంగ్రెస్ వర్గీయులకు మధ్య పోలింగ్ సమయంలో వివాదం ఏర్పడింది. కాంగ్రెస్ వర్గీయులు పోలింగ్ బూత్‌లో ఏజంట్‌గా ఉన్న జనసేన పార్టీకి చెందిన వ్యక్తిపై దాడికి దిగారు. తోపులాటలో టీడీపీ ఏజంట్ కూడా కింద పడడంతో కూటమి అభ్యర్థులకు, కాంగ్రెస్ వర్గీయులకు మధ్య కొంతసేపు ఘర్షణ జరిగింది. బుధవారం ఉదయం ఇరువర్గాల వారు మరోసారి ఘర్షణకు దిగారు. అంతలో స్థానికులు, పోలీసులు ఇరువురికి సర్దిచెప్పి పంపారు. వేల్పూరులో పోలింగ్ కేంద్రంలో ఎస్సీ కాలనీకి చెందిన వ్యక్తి ఓటు విషయంలో టీడీపీ, వైసీపీ ఏజంట్‌లకు మధ్య వివాదం చెలరేగింది. ఇరువర్గాలవారు ఘర్షణకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను నివారించారు. ఇరువర్గాలవారు ఒకరిపై ఒకరు బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

యడ్లపాడు, మే 14: ఈదురు గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మంగళవారం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేడిగాలులు, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు భారీ వర్షంతో ఉపశమనం పొందారు. సోమవారం జగ్గాపురం, జాలాది గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో అధికంగా కురిసింది. దీనితో మురుగు కాలువలు పొంగి పొర్లడంతో కాలువల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం మురుగు రోడ్లపైకి చేరింది. దీనితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు

యడ్లపాడులోని దిగువ ఎస్సీ కాలనీలోని ఓ కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. వర్షానికిముందు పిడుగుపడడంతో పచ్చనిచెట్టుపై ఎర్రటి మంటలు రేగాయి. ఇళ్ళకు దూరంగా ఉండడంతో చెట్టు మాత్రమే కాలిపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రైలు కింద పడి యువకుడి మృతి



పెద ఖాశిం మృత దేహం

నరసరావుపేట లీగల్, మే 14: రైలుకింద పడి పట్టణానికి చెందిన యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని బరంపేటలోని మూడు బావుల సెంటర్‌కు చెందిన ప్రొద్దుటూరు పెదఖాశిం కడపలో టీకొట్టు పెట్టుకొని జీవిస్తున్నాడు. ఎన్నికల నేపథ్యంలో పట్టణానికి వచ్చాడు. ఓటు వేసిన అనంతరం తురకపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్ళాడు. రాత్రి 9గంటల సమయంలో కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి మాట్లాడుతుండగా ఒక్కసారిగా ఫోన్ స్విచ్‌ఆఫ్ అయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని చిత్రాలయ సెంటర్ వద్ద రైలు పట్టాలపై మృతదేహం పడి ఉండటాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేటలో టీడీపీ గెలుపు ఖాయం

● డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, మే 14: నరసరావుపేట గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసే సమయం వచ్చిందని ఎన్డీఏ కూటమి నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు .నియోజకవర్గంలో ప్రశాంతంగా ఓటింగ్ పూర్తవడంపై సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయానికి చేరుకున్న కార్యకర్తలు, నాయకులతో సరదాగా గడిపారు. నరసరావుపేట గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేయబోతున్నామని చెప్పారు. నియోజకవర్గంలో నియంతృత్వ పోకడలకుపోతున్న గోపిరెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్ ప్రక్రియలో గందరగోళం సృష్టించి పోలింగ్ బూత్‌లను హైజాక్ చేయాలని గోపిరెడ్డి ముఠా ప్రయత్నించినప్పటికీ,ప్రజలు తిరుగుబాటు చేయడంతో వారంతా తోకముడిచారని అరవింద బాబు పేర్కొన్నారు.



కవాతులో పాల్గొన్న డీఎస్పీ వర్మ, ఇతర పోలీసు అధిఆరులు

నరసరావుపేటలో పోలీసు కవాతు

నరసరావుపేట లీగల్, మే 14: పట్టణంలో సోమవారం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మంగళవారం నరసరావుపేట డీఎస్పీ వర్మ ఆధ్వర్యంలో భారీస్థాయి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన వారు ఎవ్వరూ కూడా ఎటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, చర్యలకు పాల్పడవద్దని కోరారు. ఆ విధంగా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో 144వ సెక్షన్ అమల్లో ఉందని, ప్రజలు ఈ అంశాన్ని గమనించి శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ వర్మ, రెండో పట్టణ సీఐ భాస్కర్, ఎస్ఐలు అశోక్, సతీష్, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

నూజెండ్లలో రాజకీయ ఘర్షణలు

● ఇరువర్గాలపై కేసులు ● గ్రామంలో పోలీసు పికెటింగ్

నూజెండ్ల, మే 14 : మండల కేంద్రం నూజెండ్లలో ఎన్నికల రాజకీయాల ఘర్షణలు నిత్యకృత్యంగా మారాయి. ఆధిపత్య పోరులో కార్యకర్తలకు రక్షణగా రాజకీయ నాయకులు మద్దతు తెలపటంతో సోమ, మంగళవారాల్లో నూజెండ్ల ప్రధాన కూడళ్ళలో గొడవలకు ఇరువర్గాల వారు పూనుకోవటంతో సామాన్య ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఘర్షణలు జరిగిన సమయంలో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్ది కొద్దిసేపటికి మరలా వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ముందే కొట్లాట జరగటం విస్మయం కలిగిస్తోంది. పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన వాగ్వివాదానికి సంబంధం ఉన్న జనసేన కార్యకర్త కాటం పవన్ ఇంటికి వెళ్తుండగా వైసీపీ నాయకులు దాడి చేయటంతో కార్యకర్తలకు అండగా టీడీపీ నాయకులు రావటంతో వైసీపీ నాయకులకు, టీడీపీ నాయకులకు మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం మరోమారు ఇరువర్గాలు ప్రధాన కూడళ్ళల్లో రాళ్ళ దాడి చేసుకున్నారు. వైసీపీ నాయకుల రాళ్ళ దాడిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలైన మేదరమెట్ల చెంచారావు, దేవినేని శ్రీను, భావన కర్ణబాబు, గంగవరపు భాస్కర్, గంగినేని బ్రహ్మనాయుడు, బాబు, బేతపూడి చిరంజీవి, మేదరమెట్ల అంజి, ఎండ్లూరి శ్రీను, గంగినేని నాగ, లగడపాటి బ్రహ్మయ్య, చంద్రపున్నారావులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా టీడీపీ నేతలు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ, మాచర్ల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థులు జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు తదితర టీడీపీ నాయకులు పరామర్శించారు. తాము టీడీపీ నాయకుల దాడుల్లో గాయపడ్డామని వైసీపీ నాయకులు జెక్కిరెడ్డి గోవిందరెడ్డి, అమ్మిరెడ్డి శేషమ్మ, రొడ్డా రామిరెడ్డి, భవనం సంజీవరెడ్డి, ఖాజా జయమ్మ, బోడపాటి మూర్తయ్య, శ్రీనులు టీడీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పోలీసు పికెట్ నిర్వహిస్తున్నామని, ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఎన్నికల అనంతరం పాతచెరుకుంపాలెంలో వైసీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన జెడ్డా సుబ్బారావు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా నూజెండ్ల మండలంలో ఎన్నికల అనంతరం ఘర్షణలు జరగటంతో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, మే 14: స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థలో మీడియేటర్స్‌గా సేవలు అందించటానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించిన మండల న్యాయ సేవాధికార సంస్థ మంగళవారం మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాద సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ సదస్సులో 13వ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్ సత్యశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మీడియేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక న్యాయాధికారులు పూర్ణిమ, ప్రవల్లిక, న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషుల	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
● పెదకూరపాడు	2,32,463	1,01,833	1,05,469	5	2,07,307	89.18
● చిలకలూరిపేట	2,26,646	93,150	1,00,472	32	1,93,654	85.14
● నరసరావుపేట	2,32,778	92,040	96,648	15	1,88,701	81.06
● సత్తెనపల్లి	2,42,047	1,03,116	1,07,381	3	2,10,500	86.97
● వినుకొండ	2,64,559	1,16,772	1,19,263	1	2,36,036	89.22
● గురజాల	2,73,971	1,12,704	1,18,219	22	2,30,945	84.30
● మాచర్ల	2,62,404	1,07,903	1,11,538	10	2,19,451	83.69
మొత్తం	17,34,858	7,27,518	7,58,988	88	14,86,594	85.69

ఉద్దేశపూర్వకంగానే టీడీపీ వారిపై దాడులు

● రాళ్ళ దాడిలో గాయపడిన కార్యకర్తలకు ప్రత్తిపాటి పరామర్శ

చిలకలూరిపేట అర్బన్, మే 14: సోమవారం పోలింగ్ సందర్భంగా అధికార వైసీపీ నాయకులు పథకం ప్రకారం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఏజెంట్లపై దాడులు, హత్యాయత్నాలకు పాల్పడ్డారని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. హింస ద్వారా భయపెట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూసిన వారందరిపై ఎన్నికల సంఘం, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులు ఏ స్థాయి వారైనా అరెస్టు చేసి జైల్లో పెట్టాలి, కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. చిలకలూరిపేట మండలం కావూరులో సోమవారం జరిగిన వైసీపీ దాడిలో గాయపడిన మాలంపాటి చరణ్, మద్దాలి వెంకటప్రసాదు, ఉడతా కోటేశ్వరరావు, తన్నీరు జనార్ధన్‌లను నరసరావుపేట శాయి తిరుమల ఆస్పత్రిలో పరామర్శించి దాడి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వైసీపీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే హింస: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 14: వైసీపీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే పల్నాడు హింసాకాండ జరిగిందని కూటమి చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఆరోపించారు.. మరీ ముఖ్యంగా మాచర్లలో మారణహోమానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భారీ కుట్ర పన్నారన్నారు. వందలమంది రౌడీలను సమీకరించి మాచర్ల, కారంపూడిలో చేసిన స్వైరవిహారమే అందుకు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. పోలింగ్ సందర్భంగా, అనంతరం జరిగిన హింసాకాండపై మంగళవారం ప్రత్తిపాటి ప్రత్యేకంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల పిన్నెల్లితో పాటు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపైనా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఓడిపోతున్నామనే అక్కసుతో పథకం ప్రకారం హింసకు తెరలేపారన్నారు. కారంపూడిలో ఎమ్మెల్యే పిన్నెల్లి దగ్గరుండి మరీ తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేయించారన్నారు. అదే కారంపూడిలో ముస్లిం వర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడి కారును తగులబెట్టడం దుర్మార్గమన్నారు. సీఐ నారాయణస్వామిపై కూడా దాడి చేయడం వారి ఆగడాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. ఓడిపోతున్న క్రమంలో వారికి ఉనికిని కాపాడుకోవడానికే కిరాయి రౌడీలను దించి ఈ దురాగతానికి పాల్పడ్డారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే మాచర్లలో ఏ క్షణంలో ఏం జరుగుతుందనే భయంతో ప్రజలు బతుకుతున్నారన్నారు. మాచర్ల నుంచి సాగర్ వెళ్లే రహదారిలో వైసీపీ మూకలు మకాం వేసి ఉన్నారని తమకు సమాచారం ఉందన్నారు. తెలుగుదేశం మద్దతుదారుల ఆస్తుల ధ్వంసం, ప్రాణాలు తీయడమే లక్ష్యంగా పిన్నెల్లి ఈ దాడులను నడిపిస్తున్నారని ఆరోపించారు ప్రత్తిపాటి. పోలీసులు ఏమాత్రం ఉపేక్షించినా జరిగే రక్తపాతానికి వారిదే బాధ్యతని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి, కాసు మహేష్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని, వైసీపీ రౌడీమూకలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కూడా పోలీసులపైనే ఉందన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సైనికోద్యోగి మృతి



మద్దు విజయసారథి
(ఫైల్ ఫొటో)

యడ్లపాడు, మే 14: పదహారో నంబరు జాతీయరహదారిపై యడ్లపాడు మండలం వంకాయలపాడు పరిధిలో ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. యడ్లపాడు మండలం ఉన్నవ ఎస్సీ కాలనీకి చెందిన మద్దు విజయసారధి(40) మాజీ సైనికోద్యోగి. ఈ నెల 12న చిలకలూరిపేటలోని ఓ సెల్ షాపులో రిపేరుకు ఇచ్చిన ఫోన్‌ను తెచ్చుకునేందుకు బంధువు మద్దు ఏసోబుతో కలసి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. వంకాయలపాడు పరిధిలోని పెట్రోలు బంకు సమీపంలో బైకు అదుపు తప్పి పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో విజయసారధి తీవ్రంగా గాయపడగా ఏసోబుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ విజయసారధి మంగళవారం మృతిచెందాడు. మృతునికి భార్య ప్రియదర్శిని, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి, బంధువులకు అప్పగించారు.

సీబీఎస్ఈ పరీక్షల్లో చౌదరయ్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట మే 14: ప్రకటించిన సీబీఎస్ఈ పరీక్ష ఫలితాలలో స్థానిక సాదినేని చౌదరయ్య స్కూల్ విద్యార్థులు 100% ఉత్తీర్ణతను సాధించారు. ఈ పరీక్షలకు 59మంది విద్యార్థులు హాజరు కాగా 400 మార్కులు పైగా 16మంది, 300మార్కులు పైగా 43మంది విద్యార్థులు సాధించారు. సీహెచ్ తేజస్విని 467 మార్కులతో ప్రథమస్థానం, కె.జాహ్నవి 463మార్కులతో ద్వితీయస్థానం పొందారు.



చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంలో ఓటు వేసిన శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు, కుటుంబ సభ్యులు - చిలకలూరిపేట